

మారథాన్ 5కే రన్ ప్రారంభిస్తూ రెడ్ బెలూన్లు గాలిలోకి వదులుతున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

అవగాహన, తగిన జాగ్రత్తలతో ఎయిడ్స్ నివారణ

ఎర్రబెలూన్లు ఎగురవేసి మారథాన్ 5కే రన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): అవగాహన, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లా సమగ్ర వ్యూహం (దిశ) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోదావరి ఇస్కాన్ టెంపుల్ వరకూ మారథాన్ 5కే - రెడ్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి ఈ మారథాన్‌ను ఎర్రబెలూన్లు ఎగురవేసి, జెండా ఊపి, గన్‌పేల్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదివేలకు పైగా హెచ్ఐవీ కేసులున్నాయని, వీటిని పెరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి, యువతకు ఈ వ్యాధిపై అవగాహన కల్గించడానికి ఈ 5కే రన్ నిర్వహించినట్టు చెప్పారు. జిల్లాలో హెచ్ఐవీ కౌన్సెలింగ్, పరీక్షల కోసం ఐదు ఎస్ఏ-ఐసీటీసీ కేంద్రాలు, 38 పీహెచ్‌సీ ఎఫ్1 ఐసీటీసీ కేంద్రాలు, 14 యూపీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడానికి సంచార సమీకృత సలహా, పరీక్షా కేంద్రం (మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్)ను కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించారు. హెచ్ఐవీ సంబంధిత సమాచారం కోసం జాతీయ హెల్ప్‌లైన్ నెంబరు 1097 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, కుష్టు క్షయ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ గన్ని మహాలక్ష్మి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ రవితేజ, వీటీ కళాశాల ప్రతినిధి జేజే విజయ్ ప్రకాష్, దిశ క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు, ఆర్ట్స్ కళాశాల, వీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని, సాయి నర్సింగ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 5కే రెడ్ రన్ విజేతలను బాలురు, బాలికల విభాగంతోపాటు ట్రాన్స్‌జెండర్ల విభాగంలోనూ ఎంపిక చేసి వారికి బహుమతుల ప్రదానం చేశారు.

నేపాల్ హింసాత్మకం నేపథ్యంలో జిల్లాస్థాయి కంట్రోల్ రూం ఏర్పాటు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని హింస చెలరేగిన నేపథ్యంలో జిల్లాస్థాయి కంట్రోల్‌రూమ్‌ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జిల్లాకు చెందిన వ్యక్తులు, వారి బంధువులు ఎవరైనా నేపాల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం ఉంటే ఆ వివరాలను వెంటనే 8977935611 నెంబ రుకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే ఢిల్లీలోని ఏపీ భవన్ నెం.9818395787, ఆంధ్రప్రదేశ్ హెల్ప్‌లైన్ నెం.8632340678, 8500027678లో కూడా సంప్రదించవచ్చని సూచించారు.



'ఆటో' పేమెంట్

ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించింది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆర్థికంగా ఆదుకోనున్నట్టు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆటోవాలాలకు ఆర్థిక సాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్లు అనంతపురం సభలో బుధవారం అధికారికంగా ప్రకటించడంతో ఆటో కార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి.



- ఆటో కార్మికులకు ప్రభుత్వం తీపికబురు
- స్త్రీశక్తి పథకం నేపథ్యంలో నష్టపోతున్న ఆటోవాలాలకు ఏటా రూ.15 వేలు
- దసరా రోజున పథకం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఉమ్మడి జిల్లాలో 46 వేల ఆటో కార్మికులకు రూ.69 కోట్ల వరకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే హరిత పన్ను తగ్గించడంతో ఆటోలకు భారీగా తగ్గిన పన్ను భారం

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. ఆటో కార్మికుల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ప్రకటించారు. సూపర్‌సిక్స్ పథకాల సక్సెస్ సందర్భంగా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గత నెల 15వ తేదీ నుంచి మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కారణంగా ఆటోడ్రైవర్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కొన్ని రోజుల నుంచి ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటోకార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఒక్కో ఆటోవాలాకు అక్టోబరు 2న విజయదశమి రోజున ఆటో కార్మికులకు రూ.15వేల వంతున సాయాన్ని అందిస్తామని సీఎం చేసిన ప్రకటనతో ఆటో కార్మికుల్లో సంబరాలు మిన్నంటుతున్నాయి. పూట గడవడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం వేలాది ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా నింపనుందని ఆటో కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 వేల వరకు ఆటోలున్నాయి. ఇందులో కాకినాడ జిల్లాలో 13,194, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 17వేల వరకు ఆటోలున్నట్టు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆటోయూనియన్లు మాత్రం 50 వేలపైనే ఆటోలు ఉంటాయని చెబుతున్నాయి. ఈ పథకం అమలైతే ఉమ్మడి జిల్లాకు రూ.69 కోట్ల వరకు నిధులు కావలసి ఉంది.

అప్పట్లో ఊరించి ఊరించి అరకొరే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించారు. అదీ లబ్ధిదారులను ఎడాపెడా కోసేసి సంఖ్య తగ్గించేశారు. పైగా ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ అయిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీవోలను రంగంలోకి దించింది. చలాన్ల పేర్లతోను, రవాణాశాఖ నిబంధనల పేరుతోను రకరకాల ఫైన్‌లు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకునేది. పైగా వాహనమిత్ర పథకాన్ని కొంతకాలమే అమలుచేసి గాలికి వదిలేశారు. ఇక దసరా నుంచి అమలుకానున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు జారీచేయనుంది. పథకానికి అర్హత సాధించడానికి నిబంధనలపై స్పష్టత ఇవ్వనుంది. సొంత ఆటో ఉన్నవారు, అలాగే అద్దెకు తీసుకుని నడుపుతున్న కార్మికులు ఉమ్మడి జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈనేపథ్యంలో సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనేదానిపై స్పష్టత రానుంది. ఇదిలా ఉంటే గతంలో ఆటోలు ఉన్నప్పటికీ ఆటో నడిపే లైసెన్సు, బ్యాడ్జీలు కలిగిన వారికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కొత్త మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. దీనిపై కోనసీమ జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాల ద్వారానే ఎంత మంది లబ్ధిపొందుతారనేది తేలనుందని చెప్పారు.

మేలో హరిత పన్నుతో ఆనందం..

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరిత పన్ను పేరుతో ఎవరినీ వదలకుండా రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. లారీలు, టిప్పర్లు, కార్లు, ఆటోలు, స్కూలు బస్సులు, చివరకు బైక్‌లను కూడా పన్ను పేరుతో జేబులు గుల్లచేసేసింది రవాణా, రవాణాయేతర రంగాలకు సంబంధించి ఆయా వాహనాల నుంచి ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ అధికారులు హరితపన్నును వసూలు చేసేవారు. బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరితపన్నును భారీగా పెంచేసింది. సాధ్యమైనంత డబ్బును కోట్లలో పిండుకునేందుకు 2022 జనవరి 1 నుంచి హరితపన్ను పెంపును అమలుచేసింది. అప్పటిదాకా రూ.200 ఉన్న పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసేసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడు నుంచి పదేళ్ల అయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు పది నుంచి పన్నెండేళ్లదాటితే ఒక త్రైమాసికం పన్ను విలువ, 12ఏళ్ల దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రవాణా, రవాణాయేతర వాహనాలపై భారీగా పన్ను భారం పడింది. పెరిగిన పన్ను భారం భరించలేక వాహనదారులంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆటోవాలాలకు భారీగా పన్ను భారం తప్పింది.



- గుడ్డు ధర దోబూచులాట
- మొన్నటి వరకు బాగున్నా.. తాజాగా పతనం
- రైతు ధర రూ.5.45.. చేతికి దక్కేది ఇదే
- మరోవైపు పడిపోయిన దిగుబడులు
- బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర రూ.7

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లకు మంచి ధర పలకడంతో పౌల్ట్రీ రైతులు ఎంతో ఆనందపడ్డారు. అయితే ఈ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. కొద్దిరోజులుగా రైతుకు దక్కే గుడ్డు ధర అంతకంతకూ దిగజారిపోతోంది. ప్రస్తుతం గుడ్డు ధర పేపర్ రేటు ప్రకారం రూ.5.45కు పడిపోయింది. ఇది కూడా రైతుకు పూర్తిగా దక్కడం లేదు. ఈ ధరలో ఏజంటు కమిషన్ రూ.0.25 పైసలు పోతుంది. అంతేగాకుండా ట్రేడర్లు నిర్ణయించిన కమింగ్ రేటు ప్రకారమే ఇప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి. దాంతో రైతు చేతికి రూ.5 మాత్రమే దక్కుతోంది. ఈ ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదని పౌల్ట్రీ రైతులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి కోళ్లకు ఇటీవల పలు రకాల తెగుళ్లు రావడంతో కోళ్ల సంఖ్య పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.30 కోట్ల కోళ్లు ఉండగా, వీటి సంఖ్య 90 లక్షల వరకు పడిపోయింది. దీంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అయ్యే గుడ్లు ప్రస్తుతం 65 లక్షల నుంచి 70 లక్షలకు పడిపోయాయి. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురై కోళ్లు చనిపోవడంతో గుడ్లకు గిరాకీ పెరిగి గుడ్డు ధర రూ.5.90 వరకు ఎగబాకింది. అయితే గత పది రోజులుగా గుడ్డు ధర పడిపోవడం ప్రారంభించి ప్రస్తుత ధర రూ.5.45పైసలుగా ఉంది. ఉత్పత్తి తగ్గినా గుడ్డు ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంబరపడినంత సమయం కూడా లేకుండా పతనం దిశగా పయనిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలకాలంలో ఒడిసా సహా ఇతర రాష్ట్రాల్లో పౌల్ట్రీల సంఖ్య పెరగడంతో ట్రేడర్లు కూడా మన గోదావరి ప్రాంత ఎగుమతులపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం కమింగ్ ధరకే ప్యాకేజీలు జరుగుతుండడంతో పేపర్ ధర రూ.5.45 ఉన్నప్పటికీ ఏజంటు కమిషన్ 0.25 పైసల భారం ఎలాగూ రైతుపైనే పడుతోంది. అంతేకాకుండా అక్కడి ట్రేడర్లు నిర్ణయించిన ధరనే కమింగ్ రేటుగా పరిగణించడంతో ప్రస్తుతం రైతు చేతికి రూ.5.00 మాత్రమే చేరుతోంది. ప్రస్తుతం కొత్త బ్యాచ్‌లు వేయడంతో అవి గుడ్డు పెట్టే దశకు చేరుకునేందుకు మరో నాలుగైదు నెలల సమయం పడుతుందని, అప్పటివరకు ఇదే పరిస్థితి కొనసాగితే తాము నష్టాల బారిన పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఫీడ్ ధరలో పెద్దగా మార్పు లేకపోవడంతో టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని, గుడ్ల ఉత్పత్తి పెరిగే వరకు రూ.6.00 పైబడి ధర పలికితే గాని తాము కోలుకోలేమని రైతులు అంటున్నారు. వచ్చే శీతాకాలంపైనే ఆశలు పెట్టుకున్నామని, అప్పటికైనా ధర పెరిగితే నష్టాలు తగ్గుతాయని చెబుతున్నారు.

మార్కెట్‌లో ఇష్టారాజ్యం

వినియోగదారుల కోణంలో చూస్తే కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6.50 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి ఏడున్నర వరకు విక్రయాలు సాగుతున్నాయి. దాంతో చాలా దారుణంగా కోడిగుడ్ల ధరలు పెరిగిపోయాయని సామాన్యులు గగ్గోలుపెడుతున్నారు. పౌష్టికాహారం కోసం ఎక్కువగా గుడ్లనే వినియోగిస్తున్నందున అధిక భారం పడుతోందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రైతు వద్ద ధరలు తగ్గుతుండడంతో అటు హోల్‌సేల్‌లోనూ, ఇటు రిటైల్‌లోనూ ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి మాత్రం రిటైల్‌లో ఏడు రూపాయల ధరలోనే విక్రయాలు సాగుతుండడం గమనార్హం.

కోళ్ల పరిశ్రమకు పూర్వవైభవం చంద్రబాబు చేతుల్లోనే ఉంది



రాష్ట్రంలో ఏ పరిశ్రమ ఎలా ఉంది, ఎవరికి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలిసిన విధంగా మరే ముఖ్యమంత్రికి తెలియదనడంలో అతిశయోక్తి లేదు. 2014లో ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను తెలుసుకుని అనేక రాయితీలు కల్పించారు. ప్రస్తుతం పరిశ్రమ అప్పటికన్నా మరింత సంక్షోభంలో ఉంది. ప్రభుత్వపెద్దలు కోళ్ల పరిశ్రమపై దృష్టి సారించి పరిశ్రమను ఆదుకుంటారని రైతులంతా ఎదురు చూస్తున్నారు. **- పడాల సుబ్బారెడ్డి, రాష్ట్ర కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి**

అంబులెన్సుల దందాకు అంతమేది?

- విశాఖకు రూ.30 వేల కిరాయి
- చివరికి రూ.24 వేలు వసూలు
- రూ.19 వేలు కిరాయికి రూ.5 వేల కమీషన్
- 3 గంటలు రోగిని స్ట్రెచర్‌పై ఉంచి గందరగోళం
- 'ఆంధ్రజ్యోతి'ది అక్షర సత్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సుల దందాకు అంతం కానరావడం లేదు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జిల్లా యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తుంటే.. మరోవైపు అంబులెన్సుల దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఈనెల 4న 'శవాలతో బేరం' అనే శీర్షికతో ప్రైవేటు అంబులెన్సుల మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో కలెక్టర్ ప్రశాంతి దృష్టి సారించారు. డిప్యూటీ కలెక్టర్, ప్రభుత్వాస్పత్రి ప్రత్యేక అధికారి భాస్కర్‌రెడ్డిని విచారణకు నియమించారు. ఆయన పలు వాస్తవాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంబులెన్సులకు సహేతుకమైన ధరలు నిర్ణయించడానికి కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో ఇప్పటికే ఆస్పత్రికి వచ్చి కొంత సమాచారాన్ని సేకరించారు. ఈ ప్రక్రియ జరుగుతుండగానే బుధవారం ఓ పేదోడు దోపిడీకి గురయ్యాడు. రంగంపేట మండలం మర్రిపూడికి చెందిన ఓ బాలిక(17ఏళ్లు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా కొద్ది రోజులుగా రాజమహేంద్రవరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది మొదలుకావడంతో.. అక్కడి ఫీజులు తట్టుకోలేక బుధవారం ఉదయం ఆరు గంటలకు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే విశాఖపట్నం కేజీహెచ్‌లో ఆమెకు సంబంధించిన వ్యాధికి మరింత మెరుగైన వైద్యం అందుతుందని బంధువులు చెప్పడంతో అంబులెన్స్ అవసరం ఏర్పడింది. ఆమెను స్ట్రెచర్‌పై బయటకు తీసుకొచ్చి అంబులెన్స్ కోసం వెతుకులాడుతుండగా అక్కడే ఉన్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు రంగంలోకి దిగారు. ఏకంగా రూ.30వేల కిరాయి అడిగారు. ఆమెకు వెంటిలేటర్ ఉన్న పెద్ద అంబులెన్స్(108 మాదిరిగా ఉండే ఫోర్స్ వాహనం) అవసరం, ఆస్పత్రి వద్ద అవి అందుబాటులో లేవు. దీనిపై ఆ తండ్రి ఆరా తీయగా పెద్ద అంబులెన్స్ వాళ్లు రూ.19వేలకే వెళుతున్నారని తెలిసింది. కానీ వాళ్లను ఆస్పత్రి వద్ద తిష్ట వేసిన ప్రైవేటు అంబులెన్స్ వాళ్లు రానివ్వమంటూ అడ్డుపడ్డారు. పెద్ద అంబులెన్స్ కిరాయి రూ.19వేలు ఇచ్చేసి, తమకు కమీషన్‌గా రూ.11వేలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఉదయం 6.30గంటలకు స్ట్రెచర్‌పై బయటకు తీసుకొచ్చిన ఆ బాలికను 9.30గంటల వరకూ అలాగే ఉంచేసి గలాటా సృష్టించారు. చివరికి సమయం మించిపోతోందనే ఆందోళనతో ఆ తండ్రి ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లను కాళ్లావేళ్లా పడితే రూ.24వేలకు ఒప్పుకున్నారు. దానిలో రూ.18 వేలు పెద్ద అంబులెన్సుకు ఇచ్చి మిగతా సొమ్ము వాళ్ల జేబులో అక్రమంగా వేసుకున్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద అంబులెన్స్‌లు, ఆటోల స్టాండ్లు ఏమిటని, ఈ దోపిడీకి అడ్డుకట్ట ఎందుకు వేయలేకపోతున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. యూనియన్లు, స్టాండ్లు అంటూ తమను గందరగోళానికి గురిచేసి దోపిడీ చేస్తున్నారని వాపోతున్నారు. సందట్లో సడేమియా మాదిరిగా తమది మరో యూనియన్ అంటూ ఇతర అంబులెన్సుల వాళ్లు చొరబడడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తాము బాగా తక్కువ ధరలకే వెళతామని చెబుతున్నారు. ఏదేమైనా పేదోళ్లను ఈ అంబులెన్సుల దోపిడీ నుంచి బయట పడేయాలని ప్రభుత్వాస్పత్రి వద్ద చర్చ నడుస్తుండడం గమనార్హం. కాగా ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వ అంబులెన్స్ సేవలు పడకేయడంపై విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ అంబులెన్సులను నిద్దరలేపి, ప్రైవేటు అంబులెన్స్ సర్వీసులను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తే సమస్యలకు చాలామటుకు పరిష్కారం దొరుకుతుంది. అంతవరకూ కనీసం ఫిర్యాదు బోర్డులయినా ఏర్పాటుచేస్తే కాస్త మేలు జరుగుతుంది.



'తల్లి' మనసు

ఎంత ఉన్నతాధికారి అయినా.. ఆమె కూడా ఒకరికి అమ్మే కదా.. ఓ బిడ్డను ఎత్తుకుని లాలిస్తున్న ఈమె ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ. నన్నయ వర్సిటీకి సర్టిఫికెట్ల కోసం వచ్చిన ఓ మాతృమూర్తి కేంద్రపరిపాలనా భవనం వద్ద చంటిబిడ్డతో వేచి ఉంది. అటువైపు వెళుతున్న వీసీ.. ఆమె వద్దకు వచ్చి ఆరా తీశారు. సర్టిఫికెట్ల పనిపై వచ్చిన ఆ తల్లికి త్వరగా పనిపూర్తి చేసి పంపించాలని సిబ్బందికి సూచించారు. అంతవరకూ బిడ్డను వీసీ ఎత్తుకుని వర్సిటీ ఆర్ట్ కామర్స్ కళాశాలలోని కార్యాలయాన్ని, ఇతర విభాగాలను పరిశీలించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరుపట్టీలను తనిఖీచేశారు. అంతసేపూ ఆ బిడ్డ ఏడవకుండా వీసీని హత్తుకుని ఉండడం విశేషం. **- దివాన్‌చెరువు**

యూరియాకు టోకెన్ తప్పనిసరి

క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. టోకెన్ పొందిన రైతుకు తప్పనిసరిగా యూరియా అందజేస్తామని, అయితే టోకెన్ మాత్రం కచ్చితంగా ఉండాలన్నారు. టోకెన్ ఉన్న రైతులు క్యూలో నిలబడాల్సిన అవసరం లేదని, ఎప్పుడైనా యూరియా తీసుకోవచ్చన్నారు. బుధవారం వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలోని రైతు సేవా కేంద్రాల సహాయకులతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ సిఫారసుల మేరకు రైతులకు యూరియా కేటాయింపు ఉంటుందన్నారు. ఆయా రైతు కేంద్రాలకు కేటాయించిన యూరియా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సహకార సంఘాల వారీగా పంపిణీ రికార్డులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏదైనా సహకార సంఘం పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెలుపల రైతులకు యూరియా అందజేస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. తాడేపల్లిగూడెం, ద్వారపూడి రైల్వే ర్యాక్ పాయింట్ల ద్వారా బుధవారం నాటికి 500 టన్నుల యూరియా జిల్లాకు చేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, జిల్లా సహకార అధికారి వెంకట రమణ, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, మార్క్‌ఫెడ్ డీఎండీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ట్స్ జనరేషన్ జీఎస్టీ ప్రచార్ అభియాన్ కో కన్వీనర్‌గా నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి చెందిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. నెక్ట్స్ జనరేషన్ జీఎస్టీ ప్రచార్ అభియాన్ కమిటీలో ఏపీ నుంచి కో కన్వీనర్‌గా నియమిస్తూ బీజేపీ జాతీయ పార్టీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. జీఎస్టీ తగ్గింపుపై చారిత్రక అడుగువేసిన నేపథ్యంలో ఏర్పాటుచేసిన జీఎస్టీ ప్రచార్ అభియాన్ కమిటీలో ఏపీ నుంచి కన్వీనర్‌గా ఎంపీ పాకా సత్యనారాయణను నియమించగా, కో కన్వీనర్‌గా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని నియమించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ జాతీయ కార్యవర్గం తనపై నమ్మకంతో కమిటీలో స్థానం కల్పించిందని, తన శక్తి వంచన లేకుండా తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. కమిటీలో స్థానం కల్పించిన ప్రధాని మోదీకి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



జీఎస్టీ.. థ్యాంక్స్

జీఎస్టీ నాలుగు శ్లాబుల విధానాన్ని రద్దు చేసి రెండు శ్లాబుల విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టనుంది. ప్రధాని మోదీ చేపట్టిన తాజా సంస్కరణలతో ప్రజలపై ఎంతో భారం తగ్గనుందని, ఈ సందర్భంగా మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ రాజమహేంద్రవరంలో బుధవారం బీజేపీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా మోదీకి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు.. **- రాజమహేంద్రవరం అర్బన్**

జిల్లా పోలీసులకు ఏబీసీడీ అవార్డు 8



- పంట మార్పిడి విధానంతో తామరపువ్వుల సాగు
- అరవిరిసిన పుష్పాలతో రైతులకు లక్ష్మీ కటాక్షం
- దైవ కార్యాలకే కాదు.. ఆయుర్వేద వైద్యానికి కూడా
- మార్కెట్‌లో భలే డిమాండ్



తామర పూలే... వికసించెనే!

'కలువకు చంద్రుడు ఎంతో దూరం.. కమలానికి సూర్యుడు మరీ దూరం. దూరమైన కొలదీ పెరుగును అనురాగం' అని ఆచార్య ఆత్రేయ అన్నట్టుగానే సూర్యోదయం అవుతుందంటే చాలు పురివిప్పిన నెమలి నాట్యమాడుతున్నట్టుగా చెరువులు, చేలల్లోని కమలాలు విచ్చుకుంటూ మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. భారతదేశ జాతీయ పుష్పం తామరపువ్వే. ఈ పువ్వును కమలం, పద్మం, అరవిందం, జలజం, అంబుజం వంటి ఎన్నో పేర్లతో పిలుస్తారు. తామరపువ్వులు ప్రధానంగా పూజలు, వ్రతాలు, యజ్ఞ యాగాది క్రతువులకు వినియోగిస్తుంటారు. తామర పువ్వుల్లోని ఔషధ గుణాలను గుర్తించి నేడు ప్రకృతి వైద్య విధానంలో వినియోగిస్తున్నారు. అంతేకాదు. ఆయుర్వేద మందుల తయారీకి తామరపువ్వులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

అటువంటి తామర పువ్వులను వరి పొలాల్లో పంట మార్పిడి విధానంగా సాగులోకి తీసుకువచ్చారు కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు. ఈయన తన స్వగ్రామంతో పాటు అమలాపురం రూరల్ మండలం జనుపల్లిలో పంటమార్పిడి విధానంలో తామర పువ్వులు పండిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. తనతో పాటు మరో 17 మంది ఇదే తరహాలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పొలాలను లీజుకు తీసుకుని తామర పువ్వులు సాగు చేస్తూ లాభాల పంట పండిస్తున్నట్టు చెప్పారు.

బురదలో పుట్టినా దేవుని పాదాల చెంతకే...

తామర పువ్వులు మనిషికి ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. బురదలో పుట్టినప్పటికీ ఎటువంటి మలినాలు అంటకుండా దేవుని పాదపద్మాల చెంతకు చేరుకుంటున్నాయి. మనిషి ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ చెడు ప్రభావానికి లోను కాకూడదు. తామరపువ్వులను ప్రధానంగా లక్ష్మీపూజతో పాటు అమ్మవారి పూజలకు విశేషంగా వినియోగిస్తారు. విష్ణుపూజతో పాటు యజ్ఞ యాగాది క్రతువుల్లోనూ వినియోగిస్తారు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, కార్తీక మాసంలో వీటిని విరివిగా వినియోగిస్తారు. ఈ పువ్వులను లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. ఎవరి ఇంటైనా వ్రతం జరుగుతుంటే ముందుగా వీటినే సిద్ధం చేసుకుంటారు.

ఆరోగ్య ప్రదాయినిగా....

ఆయుర్వేద వైద్యంలో తామర పువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. తామర పువ్వుల రేకలు, కాడలను గుండె జబ్బుల నివారణతో పాటు కామెర్లు, అతిసార వ్యాధి నివారణకు వినియోగిస్తారు. తామరపూల రసం రక్తస్రావాన్ని తగ్గించడంతో పాటు మూల వ్యాధి, దగ్గు నివారణకు, చర్మవ్యాధులు, కుష్టు వ్యాధి నివారణకు వినియోగించే మందుల తయారీలో వినియోగిస్తారు. తామర పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు తామరపువ్వుల టీ తాగితే ఉపశమనం పొందవచ్చు. తలనొప్పి, జ్వరానికి కూడా మందుగా పని చేస్తుంది. తామర పువ్వుల టీ తాగితే కార్డియాక్ అరెస్టు వంటి గుండె సంబంధిత సమస్యలు తగ్గుతాయి. తీవ్రమైన ఒత్తిడి ఆందోళనకు గురయ్యే వారికి దివ్య ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. పంట మార్పిడి విధానంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. దాంతో భక్తులకే కాదు వైద్య రంగానికి కూడా ఎంతో అవసరమైన తామరపువ్వుల సాగును రైతులు ఇప్పుడిప్పుడే ఎంచుకున్నారు. భద్రాచలం నుంచి దుంపలు తెచ్చి కడియం నుంచి రాజోలు వరకు మిత్రులతో కలిసి తామరపూల సాగు చేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు తెలిపాడు. కొందరు పశ్చిమ గోదావరి జిల్లాలో సాగు చేస్తున్నారన్నారు. ఎకరాకు రూ.25వేలు చొప్పున పెట్టుబడి పెడుతున్నాం. ఏటా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు తామరపువ్వులకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇక ఆయుర్వేద వైద్యం కోసం మరికొందరు ఈ పూల కోసం వస్తున్నారని వీరబాబు తెలిపాడు. మేజర్ డ్రెయిన్ల వెంబడి తొలకరి సాగు ముంపునకు ప్రాంతాలనే ఎంపిక చేసుకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో పొలాలను లీజుకు తీసుకుని తామర సాగు చేస్తున్నాం.




దసరా, కార్తీక మాసాల్లో మంచి డిమాండ్

వాసంశెట్టి వీరబాబు, కడియం



దేవి శరన్నవరాత్రులతో పాటు కార్తీక మాసంలో తామరపువ్వులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం జనుపల్లి పేరాయిపేటలో డాక్టర్ గొలకోటి రంగారావుకు చెందిన పొలంతో పాటు ఆరు ఎకరాల్లో తామర సాగు చేస్తున్నాం. రబీ సీజన్‌లో యథావిధిగా వరిసాగు చేస్తాం. ప్రస్తుతం పితృ పక్షం జరుగుతుంది. ఈ పక్షం రోజులు అంతగా అమ్మకాలు ఉండవు. అన్ సీజన్‌లో రూ.6కే పువ్వును విక్రయించాల్సి వస్తుంది. సీజన్‌కు అందుబాటులో వచ్చే విధంగా సాగు చేస్తుంటా. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు లాభం వస్తుంది. రానున్న సీజన్‌లో పొలం వద్దే ఒక్కో పువ్వు రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయిస్తాం. పూల వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. యజ్ఞాల కోసం ఒక్కొక్కరు 120 పుష్పాలు చొప్పున తీసుకెళ్తారు. ప్రస్తుతం ఎక్కడచూసినా తామర పువ్వు దొరికితే చాలు అన్న పరిస్థితి ఉంది. అయినా మేము మాత్రం ఎక్కువ రేటు చేసి అమ్మం. ఎందుకంటే అన్ సీజన్‌లో ఎలా ఉంటుందో చూస్తున్నాం.



ఈవీఎంలే కీలకం

పంచాయతీ ఎన్నికల్లో తప్పనున్న తిప్పలు

సులభతరం కానున్న కౌంటింగ్

ఆలమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలంటే అధికారులకు, సిబ్బందికి సవాలే. ఒకే రోజు పోలింగ్, అదే రోజు లెక్కింపు అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక. ఇదంతా జరిగేటప్పటికి కొన్ని గ్రామాల్లో తెల్లవారుతుంది. రాత్రంతా ఎంతో క్లిష్టమైన ఓటింగ్ లెక్కింపు ప్రక్రియ ఉద్యోగులకు పెద్ద సవాల్. రాష్ట్ర ఎన్నికల కమిషనరు స్థానిక పంచాయతీ ఎన్నికలకు ఈవీఎంలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మంగళవారం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా సాధ్యం

పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఈవీఎంలతో ఎలా సాధ్యమవుతుందనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే కౌటింగ్ ప్రక్రియ సులభతరం కానున్న తరుణంలో ఓటింగ్ ప్రక్రియలో మార్పులు తీసుకురానున్నారు.

అదెలా ఉంటే...

పంచాయతీ ఎన్నికలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమయం ఉంటుంది. తిరిగి రెండు గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

ఈవీఎంలతో ఎన్నిక నిర్వహిస్తే ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 లేదా 4 గంటల వరకు పోలింగ్ జరిగేలా ఏర్పాటు చేయనున్నారు.

అలా చేయడం వల్ల ఓట్లు పోలింగ్ బూత్‌ల సంఖ్య తగ్గనున్నాయి.

అదెలాగంటే..

ఎలాగంటే మేజర్ పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడం వల్ల ఒక్కో వార్డుకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఇప్పుడు ఈవీఎంలు పెట్టడం వల్ల, ఓటింగ్ పోలింగ్ సమయం పెంచడం వల్ల వార్డుకు అన్ని పంచాయతీలకు ఒక బూత్ పెట్టి, సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యునికి ఒక ఈవీఎం ఏర్పాటుచేస్తే సరిపోతుంది.

లెక్కింపు ప్రకియ సులభతరం ఇలా..

ఇప్పటివరకు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి కౌంటింగ్ మొదలుపెట్టి ముందుగా బ్యాలెట్లను కట్టలు కటేవారు.

ఆ కట్టలు ఎక్కించిన సరిపోయిన అనంతరం వార్డు సభ్యులు ఓట్లు సర్పంచ్ ఓట్ల వేరు వేరుగా లెక్కింపు చేపట్టడం తలకి మించిన భారంగా మారేంది. అన్నిటికంటే ముఖ్యంగా ఓటు ముద్ర సరిగా పడని బ్యాలెట్లు లెక్కింపు పెద్ద వివాదాస్పదమయ్యేది. ఆ ఓటు తమదంటే తమదని లెక్కింపు ఏజెంట్లు ఘర్షణకు దిగి కొన్ని సమయాల్లో కొట్లాటకు దారితీసేది. ఇలా అన్ని వివాదాలు పరిష్కరించడం, పోలీసు, పంచాయతీ శాఖల అధికారులకు స్టేజ్-2 ఆఫీసర్లకు నానా ఇబ్బందికరంగా ఉండేది.

కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు తలెత్తకుండా చిన్న, పెద్ద పంచాయతీ సమస్య లేకుండా ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ఎంతో సులభతరం కానుంది. ఓట్ల లెక్కింపు అనతరం ఉప సర్పంచ్ ఎన్నికను కూడా ఆ రోజు సాయంత్రానికే పూర్తి చేసే అవకాశం ఉంది.

గతంలో ఓట్ల ఎక్కింపు తెల్లవారుజాము వరకు జరగడం వల్ల ఉప సర్పంచ్ ఎన్నికలు చాలాచోట్ల వాయిదాపడేవి. వాటిని మరో రోజు నిర్వహించడం సమస్యగా మారేది.

2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 1050 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 9, 13, 19, 21 తేదీల్లో నాలుగు దశలుగా ఈ ఎన్నికలు నిర్వహించారు. 2020-21 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏప్రిల్ 3న వీరంతా పదవీ బాధ్యతలు చేపట్టారు.

నూతన సాంకేతికతపై పట్టుసాధించాలి

- మిషన్ లెర్నింగ్ విప్లవంతో భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చు
- ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతపై పట్టుసాధించి గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మిషన్ లెర్నింగ్ విప్లవంతో మెకానికల్ ఇంజనీర్లు భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చునని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ మనం కొత్తయుగంలో ఉన్నామన్నారు. డేటా ద్వారా నడిచే యుగం అల్గోరిథంల ద్వారా నడిచే శక్తిని పొందుతుందని మన ఊహ ద్వారా మాత్రమే పరిమితం అవుతుందన్నారు. మెటీరియల్ సైన్స్, అర్థశాస్త్రం, వైద్య, సాహిత్యం లేదా కళలు ఏ రంగమైనా మీరంగంలోని క్లిష్టసవాళ్లను పరిష్కరించడానికి మిషన్ లెర్నింగ్ శక్తివంతమైన లెన్స్‌ను అందిస్తుందన్నారు. మిషన్ లెర్నింగ్‌పై పట్టుసాధించాలని, ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.బి. వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ మిషన్ లెర్నింగ్ ప్రాథమికాంశాలు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ కె.శ్రీహర్షరెడ్డి, అధ్యాపకులు బి.లక్ష్మి, కె.దుర్గారావు పాల్గొన్నారు.

రూ. 92.5 కోట్లతో ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం



రివైజ్డ్ డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న అధికారులు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా లోని ప్రాచీన మూడు ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పర్యాటకశాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖాధికారులు రూ.92.5కోట్లతో రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రివైజ్డ్ డీపీఆర్‌ను బుధవారం అధికారులు అనపర్తిలో ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయం, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయం, పెదపూడి మండలంలోని గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో డీపీఆర్ తయారు చేశారన్నారు. దీనిపై ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి మార్పులు చేయాలని సూచించగా మరలా రివైజ్డ్ డీపీఆర్‌ను రూ.92.5 కోట్లతో తయారు చేశారన్నారు. దీనిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రులకు ఈసదర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

యోగా క్రీడాకారిణి మహిమకు అభినందన



మహిమను సత్కరిస్తున్న యోగా గురువు చిట్టిబాబు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఇటీవల ద్వారకా తిరుమలలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ ఏపీ స్టేట్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ -2025 పోటీలలో కాకినాడ నగరానికి చెందిన మేడిశెట్టి మహిమ 30-35 ఏజ్ కేటగిరిలో స్టేట్ సిల్వర్ మెడల్ సాధించి, రాబోయే డిసెంబర్‌లో బీహార్, రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ యోగా విద్య పీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మెయిన్ రోడ్‌లోగల రాక్ యోగా స్పోర్ట్స్ అకాడమీలో నేషనల్ యోగాసన కోచ్ డి.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో స్టేట్ విన్నర్‌కు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యోగా గురువు చిట్టిబాబు స్టేట్ సిల్వర్ మెడల్ విన్నర్ మహిమని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం యోగా కోచ్ డి.ఎస్.ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, జాతీయ పోటీలలో పాల్గొనే యోగా క్రీడాకారులను ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో యోగా శిక్షకులు కల్పన, భారతి, అర్జునరావు, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

- 3.11లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 3,11,526 క్యూసెక్కుల మిగులు ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలద్వారా 14,300క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2400క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.30 అడుగులుగా నమోదైంది.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు రూ.10,10,106 విరాళం



టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుకు చెక్కు అందజేస్తున్న అనంత శ్రీనివాస్ దంపతులు

గోకవరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం వెదురుపాక మాజీ సర్పంచ్, తంటికొండ దేవస్థానం కమిటీ సభ్యుడు బొట్టా రామకృష్ణ సోదరుడు తలారి అనంత శ్రీనివాస్, తార దంపతుల కుమార్తె హసిత శ్రీఐశ్వర్య పేరుపై బుధవారం టీటీడీకి విరాళం అందజేశారు. టీటీడీ అన్నదాన ట్రస్ట్ నిమిత్తం రూ.10,10,106ల చెక్కును జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ తిరు మల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడికి శ్రీనివాస్ దంపతులు అందించారు. శ్రీనివాస్, తార కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు.



సూపర్ హిట్

చంద్రన్న ప్రభుత్వానికి జై కొట్టిన జనం



కింద చోటు లేదు.. అందుకే ఇంతెత్తుకు..!

అనంతపురం వేదికపై నవ్యాంధ్రప్రదేశ్ పండుగ చేసుకుంది. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి జై కొట్టారు. మండే ఎండను లెక్కచేయకుండా చిందులు వేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సహా అందరి ప్రసంగాలను శ్రద్ధగా వింటూ.. హర్షధ్వానాలతో మద్దతు పలికారు. వేలాది వాహనాలు, తండోప తండాలుగా జనం వచ్చినా.. సభకు ఎలాంటి అంతరాయం కలగకుండా సహకరించారు.



మూడు జెండాలు.. మురిపించిన నేతలు





పవనిజం..

యువతరం ఉత్సాహం..

ఇంటింటికీ తాగునీరు

జలజీవన్ మిషన్ నిధులు రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

- 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు
- గోదావరి జలాలను నేరుగా ప్రాజెక్టుకు తరలింపు
- ఉమ్మడి జిల్లాలను ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజన
- పైపులైన్ ఏర్పాటుకు డీఐ పైపుల సిద్ధం



కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరంలో డీఐ పైపులతో ట్రాలీలు

పి.గన్నవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతిఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం జలజీవన్‌మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ముఖ్యఉద్దేశ్యం శివా రు ప్రాంతాల్లోను ఇంటింటికీ తాగునీరు అంది ంచడం. ఈ క్రమంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి జలజీవన్ మిషన్ నిధులు రూ.1650కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును రూపకల్పన చేసింది. 30ఏళ్లపాటు తాగునీరు అంది ంచేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ పథకం ద్వారా 2011 జనాభా లెక్కల ప్రకారం 24.92 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే కాలంలో మరో పదిలక్షల జనాభా పెరిగినా ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరందించే లక్ష్యంగా చెప్తున్నారు. జలజీవన్‌మిషన్ నిధుల్లో కేంద్రం సగం నిధులిస్తే.. మరో సగం నిధులు రాష్ట్రం మంజూరు చేయాల్సి ఉంది. శివారు ప్రాంతాలకు సైతం వేసవిలోను తాగునీరును పుష్కలంగా అందించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. కాల్వనీరుతో సంబంధం లేకుండా నేరుగా గోదావరి జలాలతో తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును తెరమీదకు తీసుకువచ్చారు. కాల్వనీరు రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారై కలుషితం అవుతున్న తరుణంలో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు రావడం శుభపరిణామమే. ఈ పథకం టీడీపీ హ యాంలో తెరమీదకు వచ్చినప్పటికీ అప్పట్లో వైసీ పీ ప్రభుత్వం వచ్చి ముందుకు తీసుకురావడంలో విఫలమైంది. పనులు ప్రారంభించకుండానే టెం డర్లు సైతం రద్దయినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటర్‌గ్రిడ్ పథ కంపై ప్రత్యేక దృష్టి కనబరిచింది. దీంతో ఇటీవలే ఈ టెండర్‌ను మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. ఇప్పటికే మండలాలవారీగా ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు సర్వే పూర్తి చేయగా సంబంధిత కంపెనీ మళ్లీ సర్వే, డిజైన్‌లు సిద్ధం చేసింది.

బొబ్బర్లంక నుంచి సఖినేటిపల్లి వరకు..

బొబ్బర్లంకలో ప్రారంభమైన పైపులైన్ అమలాపురం కెనాల్ చెంతనే పలివెల వరకు వస్తుంది. అక్కడ నుంచి అవిడి నుంచి విడిపోయిన పైపులైను వయా నరేంద్రపురం మీదుగా పి. గన్నవరం వస్తుంది. అవిడి నుంచి మరో పైపు లైన్ వయా ముక్కామల, గంగలకుర్రు మీదుగా బండారులంక చేరుకుంటుంది. అలాగే పి.గన్న వరం నుంచి ప్రారంభమైన పైపు లైను జగ్గన్న పేట వచ్చి ఒకటి మామిడికుదురు వరకు వెళ్తుం ది. జగన్నపేట నుంచి ప్రారంభమైన మరో పైపు లైను సఖినేటీపల్లి మండలం వరకు చేరుకుంటుంది. అలాగే ఈస్ట్రన్‌డెల్టాలో కూడా రూపొందిన డిజైన్ మేరకు పైపు లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు పైపు లైను ఏర్పాటు నిమిత్తం గ్రామాల్లోకి 5.5 మీటర్లు పొడవు గల డిఐ (డక్టైల్ ఐరన్ పైప్) పైపులు చేరుకుంటున్నాయి. పి.గన్నవరం మండల పరిధిలో పోతవరానికి డీఐ పైపులతో కూడిన ట్రాలీలు అధిక మొత్తంలో చేరుకున్నాయి. పైప్‌లైన్ ఏర్పాటు నిమిత్తం ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతులు తీసుకోవల్సి ఉందని పూర్తిస్థాయిలో అనుమతులు సిద్ధం చే సుకుని పనులు ప్రారంభిస్తారని అధికారులు చెప్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 35 మండలాలకు తాగునీరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదటి దశలో 35 మండలాలకు సంబంధించి 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. బొబ్బర్లంకలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రా వాటర్ ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి పైపులు ద్వారా ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్‌లకు పంపిస్తారు. అక్కడి నుంచి మండలాలకు తద్వారా గ్రామాలకు తాగునీరును పంపిస్తారు. కాగా ప్రాజెక్టును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజించి మండలాలు వారీగా తాగునీరు అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి తూర్పుగోదావరి జిల్లాలో కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు... కాకినాడ జిల్లాకు సంబంధిం సామర్లకోట, కరప, బిక్కవోలు, పెదపూడి, తాళ్లరేవు, అనపర్తి, కాకినాడ రూరల్ మండలాలు.. కోనసీమ జిల్లాకు సంబంధించి 22 మండలాలలకు మొదటి విడతగా తాగునీరు అందించనున్నారు. ఈస్టర్న్ డెల్టాకు సంబంధించి కడియం మండలంలో వద్ద ఫిల్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే సెంట్రల్‌డెల్టాకు సంబంధించి ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి 80 కిలోమీటర్లకు 30 నుంచి 40 సెంట్ల స్థలంలో ఒక సంపు, ఒహెచ్ బిఆర్, వాచ్‌మేన్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. ఆ సంపుల నుంచి గొట్టాల ద్వారా వెళ్లిన తాగునీరు గ్రామాల్లో పంపిణీ జరుగుతుంది. గ్రామాల్లో 20 నుంచి 25వేలు జనాభాకు ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి తద్వారా తాగునీరు అందించనున్నారు. అదే విధంగా ఇప్పటికే మండలాల్లో కొనసాగుతున్న తాగునీరు ప్రాజెక్టులను యథావిధిగా ఉంచి ఎప్పుడైనా వాటర్‌గ్రిడ్‌కు సంబంధించి పైపులైన్లకు సంకేతిక సమస్య తలేత్తితే ఈ ప్రాజెక్టును తాత్కాలికంగా ఆయా గ్రామాల్లో తాగునీరు కొరత రాకుండా వినియోగించవచ్చని అధికారులు చెప్తున్నారు. కాగా ఫిల్టర్ యూనిట్‌లు, సంపులకు ప్రస్తుతం భూసే కరణ జరుగుతుందని సంబంధిత అధికారులు చెప్తున్నారు. రెండోదశలో మిగిలిన మండలాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా లంకగ్రామాలకు సైతం తాగునీరుందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అన్నవరం దేవస్థానానికి సరఫరా చేసే దినుసుల్లో

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నందాజీ



టెండర్‌దారులతో సమావేశమైన ఈవో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులు, ఇతర రసవర్గములు సరఫరా చేసే వాటిలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ ఆహారనియంత్రణ అధికారి జీఏబి నందాజీ హెచ్చరించారు. నూతన టెండర్ ద్వారా ఈఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 మార్చి వరకు ఇటీవల పిలిచిన టెండర్లలో తక్కువధరకు కోడ్ చేసి టెండరు దక్కించుకున్న టెండర్‌దారులతో ఈవో, దేవస్థానం సిబ్బంది, ఆహారనియంత్రణ అధికారులు బుధవారం సమావేశమయ్యారు. తప్పనిసరిగా ఎఫ్ఏఎస్ ఎస్ఐ, అగ్‌మార్క్ సర్టిఫికేషన్ ఉన్న దినుసులనే సరఫరా చేయాలని, అన్ని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నాణ్యత లేమి సరుకులు సరఫరా చేసి తమ తనిఖీల్లో లోపం కనిపిస్తే వారిపై చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ హెచ్చరించారు. సమావేశంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేశవ దుర్గాప్రసాద్ ఏఈవోలు భాస్కర్, శ్రీని వాస్, అనకాపల్లి ప్రసాద్, పర్వత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో ఆలయాల ఆదాయం

రూ.15.77 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ప్రాచీన ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.15,77,190 ఆదాయం సమకూరినట్టు రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజిరామ్‌ప్రసాద్ తెలిపారు. జూలై 17, 2025 నుంచి ఇప్పటివరకూ శ్రీలక్ష్మీ గణపతి ఆలయాల్లో హుండీలను లెక్కించగా రూ.11,80,790..గోలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.3,96,400 ఆదాయం సమకూరిందన్నారు.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ పూజలు

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఐతే పాండే కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో మెమెంటో అందజేశారు.



మేనేజర్‌కు మెమెంటో అందజేస్తున్న ఈవో

కొండెవరంలో పేలిన గ్యాస్ బండ

రూ.2 లక్షల ఆస్తి నష్టం



కొండెవరంలో కాలిన తాటాకిల్లు

కొత్తపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొండెవరంలో మంగళవారం అర్ధరాత్రి గ్యాస్ బండ పేలి భారీ ప్రమాదం జరిగింది. రాయుడు నూకరాజు తాటాకింట్లో అదే గ్రామానికి చెందిన పెంకే సత్తిబాబు కుటుంబసభ్యులతో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ వాసనరావడంతో గుర్తించిన సత్తిబాబు కుమారుడు లేచి చూసేసరికి గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించాడు. అందర్నీ అప్రమత్తం చేయగా పరుగున రోడ్డుకు చేరుకున్నారు. అనంతరం గ్యాస్ బండ పేలడంతో ఇంటి పైకప్పునకు మంటలు వ్యాప్తి చెందాయి. తాటాకిల్లు కాలిపోయింది. ఇంట్లో సామాన్లు కాలిబూడిదయ్యాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఆదేశాలతో బాధిత కుటుంబానికి కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ రూ.25వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ వర్మ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

ఊపిరి పీల్చుకున్న యానాం వాసులు

అదుపులోకి క్లోరిన్‌గ్యాస్ ట్యాంక్



కనకాలపేటలో సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

యానాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యానాం శివారు కనకాలపేటలో ప్రజలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లో మంగళవారం క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకైన విషయం విదితమే. బుధవారం పరిస్థితి అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్థానికులతో కలిసి సంఘటనా జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రతి 4 నెలలకు ఒక సారి క్లోరిన్ ట్యాంక్‌ను మార్చే సమయంలో ట్యాంక్‌కి ఉన్న వాచార్ పగిలిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సంఘటన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి ఇంటింటా నీటి సరఫరా నిలిపివేశారు. బుధవారం ఉదయం మంచి నీటిని కాకినాడ ల్యాబ్‌కు పంపి వచ్చిన రిపోర్టు ఆధారంగా సాయంత్రం నుంచి నీటి సరఫరా అందించారు. అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారు డిశ్చార్జ్ అయ్యారు. ఇంటింటికి యానాం ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆరోగ్య శాఖ శిబిరానికి రావాలని వారు సూచించారు.



మంచి నీటిని సేకరిస్తున్న సిబ్బంది

యువతి అదృశ్యంపై కేసు

ధవళేశ్వరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధి వీరభద్రరావునగర్ కాలనీ పాత బొమ్మూరుకు చెందిన బెండాడి రాము కుమార్తె శాంతి ప్రియ ధవళేశ్వరం జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఎప్పటిలాగానే ఈనెల 9న తండ్రి రాము కుమార్తెను కళాశాల గేటు వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కళాశాలలో, స్నేహితులు, బంధువులు ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 9440796586, 94919 99336 లో తెలియజేయాలని సీఐ గణేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు కొత్తూరు గురుకుల కళాశాల విద్యార్థులు





చిన్ని, సంతోష్

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న అండర్ 19 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.రాజు తెలిపారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎంపికల్లో రాష్ట్రస్థాయి పోటీలకు తమ కళాశాలకు చెందిన సీనియర్ ఎంపీసీ విద్యార్థి జక్కుల సంతోష్, జూనియర్ బైపీసీ విద్యార్థి వై.చిన్ని ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులు, పీడీ సతీష్ రాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సమస్యలపై గళం

- అధికారుల పొంతన లేని వివరణలపై జడ్పీటీసీల అసహనం
- కాకినాడలో ఉమ్మడి జిల్లా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీలు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలు, సమస్యలపై జడ్పీటీసీలు గళమెత్తారు. అధికారుల పొంతనలేని వివరణలపై అసహనం వ్యక్తం చేశారు. కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయా అంశాల స్థాయి సంఘాలు సమీక్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధి కారు లకు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు.

పూడికతీత పనులు చేపట్టాలి : జడ్పీటీసీలు

ప్రస్తుత ఖరీఫ్, రానున్న రబీ సీజన్‌లకు కాలు వల ద్వారా నీరు సక్రమంగా పంట పొలాలకు అందేలా చూడాలని, అకాల వర్షాల కారణంగా పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఇరిగే షన్ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ఏడోస్థాయి సంఘం చర్చలో భాగంగా ఇరిగేషన్ కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులు, కొత్తగా ప్రతిపాదిం చిన అంశాలు, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న ఇరి గేషన్ పనుల పురోగతిపై అధికారులు సంబంధిత వివరించారు. నాల్గోస్థాయి సంఘం చర్చలో విద్య వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సీజనల్ వ్యా ధుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని సభ్యులు తెలిపారు. అర్బన్ రూరల్ హె ల్త్ మిషన్ కింద అవసరమైన చోట పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలను అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అధికారులు పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని వివిధ మండలాల సభ్యులు అధికారులను కోరారు. ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెండో స్థాయి సంఘం చర్చలో గ్రామీణ అభివృద్ధికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, ఉపాధి పనిదినాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు ఇరుపక్కల తుప్పలు తొలగించడం, పశువుల షెడ్ల నిర్మాణంపై సభ్యులు అధికారులను వివరాలు కోరారు. ఐదో స్థాయి సంఘం చర్చలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంది ంచాలని సభ్యులు సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా అందించడం ద్వారా రక్తహీనత సమస్యకు గురికాకుండా చూడాలన్నారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామాల్లో సక్రమంగా తాగునీరు, పారి శుధ్య ంపై సూచనలు చేశారు. సంక్షేమ శాఖల చర్చలో వివిధ సంక్షేమ వసతి గృహాల పనితీరున సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చాలని సూచించారు. స్థాయి సంఘాలు చర్చించి సూచించిన అంశాలన్నింటిపై ఉమ్మడి జిల్లాలోని అధికారులు సత్వర చర్యలు చేపట్టి రానున్న సర్వ సభ్య సమావేశంలో పూర్తిస్థాయి సన్నద్ధతతో వివరించాలని జడ్పీ చైర్మన్ కోరారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మూడో స్థాయి సంఘం వ్యవసాయ శాఖ చర్చలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యూ రియా కొరత లేకుండా అధికారులకు సూచిం చారు. మోతాదుకు మించి యూరియా ఉపయో గించడం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడు తున్నారని, ఈ విషయమై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. మరో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ అధి కారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు.

అక్షరాంధ్ర ప్రతిజ్ఞ

అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా వయోజన విద్యాశాఖ డీఈ పోశయ్యతో కలిసి ఎమ్మెల్సీలు, సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్షరాంధ్ర వయోజన విద్య పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత రామచంద్రపురం జడ్పీటీసీ ఎం.వెంకటేశ్వరరావు అకాల మృతికి చింతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఐదో స్థాయి సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణమూర్తి, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీలు వీర్రాజు, కూడుపూడి, జడ్పీటీసీలు

దొంగలు దొరికారు...

పంచాయతీ కార్యాలయంలో బంధించిన గ్రామస్తులు



గ్రామస్తులకు దొరికిన దొంగలు

రాజానగరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పుగోనగూడెంలో గత కొంతకాలంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై వడిశలేరు రోడ్డు సమీపంలో విటుల వద్దకు వెళ్లి నగదును దోచుకునేందుకు బ్యాగును బలవంతంగా లాక్కుకుంటున్న సమయంలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చేసరికి ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. మరో నలుగురు పొలాల్లోకి దూకి పరారయ్యారు. పట్టుబడిన ఇద్దరికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బధించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ ఇద్దరిని గ్రామస్తులు ప్రశ్నించగా తమది తాళ్లపూడి గ్రామమని మొత్తం ఆరుగురం వచ్చామని, మిగిలిన నలుగురు తప్పించుకుని పారిపోయారంటూ చెప్పారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు.

జ్వరంతో లాగరాయి మహిళ మృతి



మరణించిన జనని (ఫైల్)



జనని కుమారుడితో ఎమ్మెల్యే దంపతులు

రాజవొమ్మంగి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో 3నెలలుగా ప్రజలు అనారోగ్యానికి గురై మంచం పట్టిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆ గ్రామాల్లో పర్యటించి ప్రజలు భయపడొద్దని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయాన్నే లాగరాయికు చెందిన కొంతం జనని (30) జ్వరంతో మృతిచెందింది. జనని ఆగస్టు 30న లాగరాయి ప్రభుత్వాసుపత్రికి వెళ్లిందని, అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఏలేశ్వరం ప్రైవేట్ ఆసుపత్రికి ఆపై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనపై లాగరాయి సర్పంచ్ మిరియాల గనలక్ష్మి మాట్లాడుతూ లాగరాయి ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందట్లేదని, ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్యసిబ్బంది విఫలమయ్యారన్నారు. అయితే ఏడీఎంహెచ్‌వో డేవిడ్ మాట్లాడుతూ జనని మరణానికి స్క్రబ్ టైఫాస్ పాజిటివ్ కారణమని, ఇది బాగా మురికి కాలువలు ఉండే ప్రాంతంలో మాత్రమే వస్తుందన్నారు. గ్రామాల్లో లక్షణాలు ఉన్నవారి నుంచి శాంపిల్స్ తీసు కుంటావున్నారు. కాగా లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం డీపీపీవో కార్యాలయ ఏవో సుబ్బారావు తనిఖీ చేశారు.

బాలుడికి అండగా ఎమ్మెల్యే

కొంతం జనని మృతిచెందడంతో ఆమె కుమారుడు సూర్య దీక్షిత్ (7) అనాథ అయ్యాడు. జనని మరణ వార్త తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం లాగరాయిలో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య దీక్షిత్ విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు తామే తనని చూసుకుంటామని ఎమ్మెల్యే దంపతులు తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. మిషన్ వాత్సల్య ద్వారా ప్రతి నెల బాలుడికి ఆర్థికసాయం అందేలా చూస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించని 14 లారీలపై కేసులు

రౌతులపూడి/తునిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బండరాళ్లు, క్వారీ నల్లమెటల్ తరలిస్తూ భద్రత నిబంధనలు పాటించని లారీలపై కత్తిపూడి వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు కేసులు నమోదు చేశారు. కాకినాడ జిల్లా రౌతులపూడి- తుని మండలం తేటగుంట రహదారిలో అతివేగంగా తిరుగుతున్న 14 లారీలపై కేసులు నమోదు చేసి రూ.85 వేలు జరిమానా విధించారు. ఒక లారీని సీజ్ చేశారు. లారీలు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటంచాల్సిందేనని, ఇకపై ప్రతిరోజూ నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన అధికారుల బృందం

ఐ.పోలవరం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యకల్యాణం పచ్చతోరణంగా బాసిల్లుతున్న కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలోని మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కృషితో ఆలయ నిర్మాణానికి రూ.4కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా దేవదాయశాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పతో కూడిన అధికారుల బృందం బుధవారం వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించింది. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, గాలిగోపురం, చండీశ్వరుడు, నవగ్రహ మండపాల నిర్మాణాలను పరిశీలించింది. ఉప స్థపతి తయారుచేసిన ఆలయ పునర్నిర్మాణ ప్లానును రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించి సూచనలు చేశారు. డీఈఈ, ఉప స్థపతి, సహాయ స్థపతి, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com


అనపర్తిలో గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రధాని మోదీ, మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, వ్యాపారస్తులు

అన్నివర్గాలపై జీఎస్టీ భారం తగ్గింది

● ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణుల క్షీరాభిషేకం


మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ అమలులో గతంలో ఉన్న నాలుగు శ్లాబుల విధానం రద్దుచేసి సమూల మార్పులు తీసుకురావడం ద్వారా అన్నివర్గాల ప్రజలపై భారం తగ్గించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో జీఎస్టీ సింగిల్ డిజిట్‌కు ప్రధాని మోదీ మార్చే అవకాశం లేకపోలేదని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. జీఎస్టీని రెండు శ్లాబులకు తగ్గించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలో బీజేపీ ర్యాలీ నిర్వహించింది. క్వారీమార్కెట్ సెంటర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మీ ప్రసన్న, స్టేట్ మీడియా ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్, బొమ్ముల దత్తు, రొంగల గోపి, రేలంగి శ్రీదేవి, భగవాన్, కోడూరు లక్ష్మీనారాయణ, మద్దిపాటి రజనీ, పరిమి రాధ, కురగంటి సతీష్, వీరా వీరాంజనేయులు పాల్గొన్నారు.

జీఎస్టీని సరళీకృతం చేయడం ప్రధాని ఘనత

అనపర్తి(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 48వేల కోట్ల ఆదాయం తగ్గిపోతున్నా దేశ ప్రజలకు ఇచ్చినమాట కోసం జీఎస్టీని సరళీకృతం చేసిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకే దక్కుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలోని దేవీచౌక్‌వద్ద ఏర్పాటు చేసిన సంబరాల్లో ఎమ్మెల్యే వ్యాపారులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా వ్యాపారులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసిన ఎమ్మెల్యే అక్కడి నుంచి గాంధీబొమ్మ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ, మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు ఎమ్మెల్యే వ్యాపారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, దత్తుడు శ్రీను, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, మల్లిడి సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం

కోరుకొండ(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద బుధవారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కంటే నాగకేశవరావు మాట్లాడుతూ 15నెలల కూటమి ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకుడు డాక్టర్ అడపా శ్రీనివాస్, సొసైటీ సీఈవో ఈగల సుదర్శనరావు, మాజీ సర్పంచ్ బోలేపల్లి రామారావు, బుడ్డిగ వీర వెంకట సత్యనారాయణ, గుమ్ముళ్ళూరు మాజీ సర్పంచ్ చిటికన భాస్కరరావు, చెరుకూరి విష్ణు పలువురు రైతులు పాల్గొన్నారు.

జీజీహెచ్ శానిటేషన్ నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి

● పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి
● కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో శానిటేషన్ నిర్వహణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని, అలాగే పూర్తిస్థాయిలో భద్రతా సిబ్బందిని నియమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జీజీహెచ్ భద్రత, పారిశుధ్యం, ఆహార సరఫరా నిర్వహిస్తున్న సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. భద్రతా, శానిటేషన్ సిబ్బంది నియామకంలో ఒప్పంద నిబంధనలు పూర్తిగా పాటించాలని లేకుంటే సదరు ఏజెన్సీలకు బిల్లుల చెల్లింపుల్లో కోత విధించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. జీజీహెచ్‌లో 67 మంది భద్రతా సిబ్బంది ఉండాలని, కానీ 55 మంది మాత్రమే పనిచేయడం ఏమిటని ప్రశ్నించారు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకూ తక్కువగా ఉన్న సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా ఏజెన్సీ చెల్లింపుల్లో కోత విధించాలని ఆదేశించారు. పూర్తిస్థాయి నియామకాలు చేపట్టకపోతే ప్రస్తుత ఏజెన్సీ ఒప్పందాన్ని రద్దు చేసి వేరే సంస్థకు పనులు అప్పగిస్తామని అన్నారు. పారిశుధ్య సిబ్బంది 90 మంది ఉండాలని, మిగిలిన సిబ్బందిని వెంటనే నియమించి పరిశుభ్రతకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, రోగులకు సరఫరా చేస్తున్న ఆహారం నాణ్యతతో ఉండాలన్నారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆసుపత్రి మొత్తం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆసుపత్రికి వచ్చేవారందరి పేర్లు, వాహనాల వివరాలు గేటు వద్ద పుస్తకంలో నమోదు చేయాలని సూచించారు. జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఆయా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు రాట ముహూర్తం

గోకవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరభద్రుని గద్దెలో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంవద్ద శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పందిర రాట ఏర్పాటుచేశారు. ఈనెల 22వ తేదీన కలసస్థాపనతో గజమాల ఊరేగింపు నిర్వహించి శరన్నవరాత్రులను ప్రారంభించనున్నట్లు అర్చకుడు కృష్ణవర్మ తెలిపారు.



ఘనంగా ప్రారంభమైన నరసింహస్వామివారి పవిత్రోత్సవాలు

కోరుకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి పవిత్రోత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. 4 రోజులపాటు నిర్వహించే ఈ పవిత్రోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ అనువంశక ధర్మకర్త ఎస్‌వీ రంగ రాజభట్టర్, అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాకిని మణికంఠాచార్యులు కైంకర్యంతో లోక కల్యాణార్థం లక్ష్మీనరసింహస్వామివారికి ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రార్థనా సూక్తపఠనంతో ప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాలు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యుల బ్రహ్మత్వంలో చక్రవర్తుల సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో అనువంశక అర్చక స్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవలి, స్వీయ పర్యవేక్షణలో ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురు,శుక్ర, శనివారాల్లో స్వామివారి పవిత్రోత్సవాలు ఉదయం, సాయంత్రం, పూజలు, హోమాలు, అర్చనలతో నిర్వహిస్తామన్నారు.

యూరియా కోసం అవస్థలెన్నో!

● బస్తా యూరియా కోసం గంటలకొద్దీ వేచి ఉండాల్సిందే


తంటికొండలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

గోకవరం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కొరత లేకున్నా ఉన్న నిల్వలను సక్రమంగా సర్దుబాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. ఈ-పంట నమోదు సక్రమంగా జరగక పంటతో సంబంధం లేకుండా యూరియా పంపిణీ చేయడంతో అసలైన రైతులకు యూరియా కొరత కనపడుతుందనే విమర్శలున్నాయి. మండలంలో యూరియా పంపిణీ చేసే కేంద్రాలు రైతుల మధ్య తగాదాలకు నిలయాలుగా మారాయి. వరుస క్రమంలో కాకుండా యూరియా పంపిణీ జరిగినా, విస్తీర్ణాన్ని మించి ఒక బస్తా యూరియా కళ్ళెదుట తీసికెళ్తున్నా మిగిలిన రైతులు అధికారులపై తిరగబడే పరస్థితులు నెలకొన్నాయి. కేవలం ఒక బస్తా యూరియాను దక్కించుకోవాలంటే ఉదయం నుంచి రాత్రి వరకు కడుపుకాల్చుకొని వేచి ఉండాల్సిన పరిస్థితులు సొసైటీలు, సేల్ పాయింట్లవద్ద ప్రస్తుతం కొన సాగుతున్నాయి. నాలుగైదు గ్రామాలకు ఒకే సేల్ పాయింట్ ఏర్పాటుచేసి అమ్మకాలు జరపడంవల్ల అక్కడున్న రద్దీ దృష్ట్యా రైతులు ఒకరిపై ఒకరు కేకలు వేసుకుంటున్నారు. తంటికొండలో ఇదే రకంగా సేల్ పాయింట్ ఏర్పాటు చేయడంవల్ల బుధవారం పలు గ్రామాల నుంచి రైతులు వచ్చి యూరియాను దక్కించుకునే క్రమంలో ఒకరికొకరు పోటీపడడం కనిపించింది. దీంతో పోలీసులు దగ్గరుండి యూరియాను వరుస క్రమంలో పంపిణీ చేయించారు.

కోరుకొండలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు

కోరుకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రోజంతా పడిగాపులు అనే ఆంధ్రజ్యోతి వార్తకు స్పందించిన అధికారులు బుధవారం కోరుకొండలో గ్రోమోర్ ఎరువులషాపులో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీ, నిల్వలు తనిఖీ చేశారు. రికార్డు ప్రకారం అన్నీ సమగ్రంగా ఉన్నాయన్నారు. రైతులకు యూరియా అందించే విధానాన్ని పరిశీలించారు. ఈ సమయంలో కూడా యూరియా కోసం రైతులు గ్రోమోర్ షాపు వద్ద గుమిగూడారు. అనంతరం వారు కోరుకొండ పీఏసీఎస్‌కు చేరుకుని అక్కడ రైతులకు యూరియా అందించే విధానం పరిశీలించారు. రైతు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ చూపించి ఒక్కో రైతుకు రెండు బస్తాలు చొప్పున తీసుకెళ్లే విధానాన్ని పరిశీలించారు. తదుపరి గోడౌన్‌లో ఉన్న యూరియా బస్తాలను, రైతులకు సరఫరాచేసిన బస్తాలను సరి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.రఘుకుమార్, కోరుకొండ సొసైటీకి ప్రస్తుత సార్వాసీజన్‌లో 1621మెట్రిక్ టన్నుల యూరియాను గ్రోమోర్ షాపు ద్వారా 182 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. రైతులకు ఎరువులు అందించడంలో వ్యవసాయశాఖ ఏ విధమైన నిర్లక్ష్యం ప్రదర్శించలేదన్నారు. నానో యూరియాను కూడా 2,3 దశలో రైతులు వాడుకోవాలి. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జి.మధుబాబు, లక్ష్మీనారాయణ, శివకుమార్, గ్రోమోర్ మేనేజర్ బాసు వీరప్రసాద్, కోరుకొండ సొసైటీ సీఈవో ఆకుల వెంకటరమణ, గుగ్గిలం రవి, వీరయ్యదొర పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా ?

● మాజీ ఎంపీ ఉండవల్లికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు సవాల్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్‌పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్న మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో తాను బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం తనను కలసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఒక ఫాసిస్టు సంస్థని ఉండవల్లి అరుణ్‌కుమార్ నోటికొచ్చినట్టు మాట్లాడడం తగదని అన్నారు. సుబ్రహ్మణ్యమైదానంలో ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని, చర్చకు వస్తే చర్చించుకోవచ్చని అన్నారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఓటు వేయొద్దని చెప్పడానికి ఉండవల్లి ఎవరని ప్రశ్నించారు. అలాగే, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓట్లేసినందుకు వైఎస్ జగన్మోహనరెడ్డిని షర్మిల విమర్శిస్తున్నదని, ఆమెకు ఆస్తిలో వాటా ఇస్తే జగన్ వెనకాలే ఉండేదన్నారు.

ఆత్మహత్య నివారణ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానస, మానసిక కౌన్సెలింగ్ వేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం నిర్వహించారు. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ అంతర్జాతీయ సభ్యుడు సుంకర నాగేంద్ర కిషోర్, స్పృహ మనస్తత్వ వేత్త ఎస్.రాజేష్‌ఖన్నా రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించి మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళ బ్రదర్స్‌కు మాగంటి మురళీమోహన్ పరామర్శ

రంగంపేట,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు తల్లి ఆళ్ళ వీర్రాఘవలు ఇటీవల మృతిచెందారు. బుధవారం రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, సినీనటుడు మాగంటి మురళీమోహన్ ఆళ్ళ సీతారాములు, ఆళ్ళ బ్రదర్స్ బాబి,రామకృష్ణ, గోవిందులను పరామర్శించి వీర్రాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి, తమ ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అలాగే బొల్లినేని హాస్పటల్ డాక్టర్ నరేష్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావు పరామర్శించారు.

అజాతశత్రువు సురవరం సుధాకరరెడ్డి

● సంతాప సభలో నివాళులర్పించిన వివిధ పార్టీల నాయకులు



సురవరం సంతాపసభలో మాట్లాడుతున్న వ్యాపారవేత్త కంటిపూడి సర్వారాయుడు

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అజాతశత్రువు అని, కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరగాలని ఆయన ఆకాంక్షించారని పలువురు వక్తలు పేర్కొన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావంతో ఆయన ప్రస్థానం సాగిందని పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో సురవరం సుధాకరరెడ్డి సంతాపసభ సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త కంటిపూడి సర్వారాయుడు మాట్లాడుతూ సురవరం అజాతశత్రువుగా, వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాద రాజకీయాలు విజృంభిస్తున్న తరుణంలో సురవరం మృతి తీరనిలోటని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ పార్టీలో అత్యంత కీలకమైన పదవుల్లో ఉన్నప్పటికీ అణగారిన వర్గాలను వదల్లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలేపల్లి మురళీధర్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల వరదరాజు సాది, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, బలరామనాయుడు తదితరులు మాట్లాడారు. తెలుగుదేశం, సీపీఎం, సీపీఐ, మహిళా సమైక్య, ప్రజానాట్యమండలి, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా సురవరం సుధాకరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సమగ్రాభివృద్ధే నా లక్ష్యం

● 50వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమగ్రాభివృద్ధే నా లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 50వ డివిజన్‌లో రూ.40లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 15 నెలలలో ఈ వార్డులో రూ.కోటి 77లక్షలతో రోడ్లు, కాలువలు, పార్కులు వంటి అభివృద్ధి పనులు పూర్తిచేసామని చెప్పారు. ప్రస్తుతం రూ30లక్షలతో పనులు జరుగుతున్నాయని మరో రూ.35లక్షలతో పనులు జరుగుతాయని చెప్పారు. ఇవి కాకుండా రూ2.50 కోట్లు పనులు టెండరు దశలో ఉన్నాయని దీంతో ఈ 50వ డివిజన్‌లో మొత్తం రూ.5కోట్లతో అభివృద్ధి జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి మరుకుర్తి రవియాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన , బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చర్చిలో పరిపాలన ఆర్థిక లోపాలపై ఆర్డీవో విచారణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దానవాయిపేటలోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో గత దశాబ్ధకాలంగా పరిపాలనలో తలెత్తిన ఆర్థిక లోపాల ఆరోపణలపై ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్ విచారణ చేపట్టారు. బుధవారం మైనార్టీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో కలిసి సంయుక్తంగా విచారణ చేపట్టారు. చర్చి సభ్యులలో ఒక వర్గంవారు చేసిన ఫిర్యాదుతో 2013- 2023 మధ్య ఆర్థిక అక్రమాలు జరిగినట్లు, ఆడిట్ సక్రమంగా జరగకపోవడం, పారదర్శకత లోపించడం, కోర్టు ఆదేశాలు ఉల్లంగించడం వంటి పలు ఆరోపణల నేపథ్య ంలో విచారణ చేపట్టి సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆర్డీవో తెలిపారు.

● మోరంపూడి సర్వే నెం.98లో ఆర్‌వోఆర్ కేసుల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడి గ్రామ సర్వే నెం.98కు సంబంధించిన ఆర్‌ఓఆర్ కేసును ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. ఈసందర్భంగా భూ రికార్డులను పరిశీలించి ఎంట్రీల నిజానిజాలను ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై దివాన్‌చెరువులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని కాటవరం గ్రామానికి చెందిన తండ్రీకుమారులకు తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించి పోలీస్‌లు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి గండేపల్లి మండలం నాయకంపల్లికి ఉద్యోగ పనినిమిత్తం కర్రిశెట్టి లోకనాధ సుధాకర్, తండ్రి వెంకటరెడ్డి శ్రీనివాస్‌తో కలసి బైక్‌పై వెళ్తున్నారు. వారు ఇక్కడకు వచ్చేసరికి వెనుకనుంచి వచ్చిన లారీ వారిని ఢీకొంది. ఈప్రమాదంలో సుధాకర్ కుడికాలుకు తీవ్రగాయాలు కాగా శ్రీనివాస్‌కు కంటికి, ముఖానికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. బొమ్మూరు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఉండ్రాళ్ల తద్ది

● వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు


వరసిద్ధి వినాయకుడిని దర్శిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రంగాపురం గ్రామంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా ఉండ్రాళ్ల తద్ది సందర్భంగా వినాయకుడికి లక్ష గరికపూజ, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వామిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నేత కనుమూరి సాయిరాజు ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, ఏపీ ఇరిగేషన్ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి సత్యగౌరి, కూటమి నేతలు అప్పలస్వామి, నడింపల్లి చిరంజీవిరాజు, గౌరిశంకర్, జోష్ బాబు, వత్సవాయి మణిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు కూటమినేత నక్కా సత్యనారాయణ ఐదు సీలింగ్ ఫ్యాన్‌లను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి హెచ్‌ఎం రవికుమార్‌కు అందజేశారు. సత్యనారాయణ కుమారులు రాంబాబు, శివప్రసాద్, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

'ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం అందిస్తాం'

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధ వారం అనపర్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రి అభివృద్ధికి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయని వీటితో కొన్ని కంప్యూటర్లను, పింటర్లను కొనుగోలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఈ నిధులన్నీ ప్రభుత్వం నుంచి మంజూరైవేనని గత పాలకులవల్లే చందాలు వసూ లు చేసి కైంకర్యం చేయలేదని అన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో వెనకడుగు వేసేది లేదన్నారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు దాకే దుర్గాప్రసాద్, అన్నవరం, రామారెడ్డి, మల్లేశ్వరి, వైద్యులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎన్నిక శుభపరిణామం

భారత ఉపరాష్ట్రపతిగా రాదాకృష్ణన్ ఎన్నిక శుభ పరిణామమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్డీయే అభ్యర్థిగా రాధాకృష్ణన్ ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులతో కలిసి ఆయన కేక్ కట్‌చేసి రోగులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యుత్త మ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా నిజాయితీ నిబద్ధత కలిగిన రాధాకృష్ణన్ ఈ పదవికి నిజమైన అర్హులని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, మహాశక్తి సభ్యులు కర్రి శేషారత్నం, సుభాషిణి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

కొమరిపాలెంలో పేకాట శిబిరంపై దాడి

● ఎనిమిది మంది అరెస్టు ● రూ. 34,790లు స్వాధీనం

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెంలో బుధవారం తెల్లవారు జామున ఒంటి గంట ప్రాంతంలో పేకాట ఆడుతున్నారంటూ వచ్చిన సమాచారంతో అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గ్రామానికి చెందిన చెల్లే గోవిందుకు చెందిన ధాన్యం నిల్వ చేసే సావిడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి నాలుగు మో టారు సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ. 34790 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో సావిడి యజమాని చెల్లే గోవిందుతోపాటు గ్రామానికి చెందిన చెల్లే శ్రీను, రాయి చిన్ని, కొండేటి సతీష్, సాయి వీరభద్రరావు, మందపల్లి నాగరాజు, తలారి కళ్యాణ్ బాబు, గుత్తుల వెంకటకృష్ణ వున్నారని ఎస్‌ఐ వివరించారు.

సెర్ప్ కార్యాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం

● ఆకస్మికంగా సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ మూర్తి


రాజానగరంలోని సెర్ప్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

రాజానగరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజానగరంలోని సెర్ప్ కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్వీవీఎస్ఎన్ మూర్తి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా పీడీ మూర్తి మాట్లాడుతూ సెర్ప్(వెలుగు)కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించకుండా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదంటూ ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదులు అందిన నేప థ్యంలో తాను ఆకస్మికంగా సందర్శించానన్నారు. తాను కార్యాలయ పనివేళల్లో 5.15గంటలకు సందర్శించి రికార్డులు పరిశీలించామన్నారు. ఈ సమయంలో మండల మహిళా సమాఖ్య ఏపీఎం గుమ్మడి సునీత, సీసీ జి.నాగార్జున ఏవిధమైన అనుమతిగానీ, ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయం పనివేళలు ముగియకముందే గైర్హాజరైనట్లుగా గుర్తించామన్నారు. దీనిపై సమగ్ర నివేదిక రూపొందించి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని పీడీ మూర్తి చెప్పారు.

24న దళిత రణభేరిని విజయవంతం చేయండి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న ఎస్సీలపై దాడులను నిరశిస్తూ ఈనెల 24న విజయవాడలో నిర్వహిస్తున్న దళిత రణభేరి మహాధర్నాను విజయవంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేన, జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్‌లు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవనంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయన్నారు. రాజమండ్రి బీఎస్పీ ఇంచార్జి ఇసుకపట్ల రాంబాబు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న దళితులపై దాడులు పెరుగుతూనే ఉన్నాయన్నారు. అనంతరం రణభేరి మహాధర్నా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

జిల్లా పోలీసులకు ఏబీసీడీ అవార్డు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ఏబీసీడీ అవార్డులకు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎటువంటి ఆధారాలు లేని కేసులు ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ అధికారులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏబీసీడీ అవార్డులను రాష్ట్ర డీజీపీ (ఫస్ట్,సెకండ్, థర్డ్, కన్సోలేషన్ అవార్డులను) స్వయంగా అందజేస్తారు. ఈ ఏడాది రెండవ క్వార్టర్‌కి సంబంధించి జిల్లా పోలీసులు ఏబీసీడీ అవార్డులలో మొదటి బహుమతికి ఎంపికయ్యారు. రెండో బహుమతి మంగళగిరి, మూడో బహుమతి ధర్మవరం రూరల్ పీఎస్, కన్సోలేషన్ బహుమతి ఒం గోలు తాలూకా పీఎస్‌కు దక్కాయి. కొవ్వూరు పట్టణానికి చెందిన వెస్టేజ్ ఉత్పత్తుల వ్యాపారి పెండ్యాల ప్రభాకరరావును 2025 మార్చి నెలలో మండలంలోని దొమ్మేరు పంటపొలాల్లో హత్యచేసి, నగదు దోచుకుపోయిన కేసును జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్ ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ కే.విజయ్‌బాబు, ఎస్‌ఐలు పీ.రవీంద్ర, కే.జగన్మోహన్, కె.శ్రీహరిరావుతో పాటు పోలీసు సిబ్బంది, ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ కేసు ను అతి తక్కువ సమయంలో ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన జిల్లా ఎస్పీ, డీఎస్పీ, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్‌లు సిబ్బంది ఈ నెల 12వ తేదీన మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా చేతులమీదుగా ఏబీసీడీ అవార్డును అందుకోనున్నారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

బిక్కవోలు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యా సమస్యల పరిష్కారంకోసం తలపెట్టిన రణభేరి కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.గోవిందరావు, ఎస్.సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నేతృత్వంలో ఈనెల 15 నుంచి 19 వరకూ రాష్ట్రమంతటా రణభేరి జాతా కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు.

ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై రణభేరి

రంగంపేట(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారించాలని కోరుతూ ఈనెల 15నుంచి 19వ తేదీ వరకూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి చేపట్టిందని జిల్లా యూటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షురాలు విజయ్‌గౌరి తెలిపారు. బుధవారం దొడ్డిగుంట పాఠశాలలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వర్మీకంపోస్ట్ తయారీ యూనిట్ల తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో నారాయణపురం, గాదాలమ్మనగర్ ప్రాంతాలలో ఉన్న వర్మీకంపోస్ట్ తయారీ కేంద్రాలను నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం ఆయన యూనిట్లను పరిశీలించి మాట్లాడారు. వర్మీకంపోస్ట్ విధానంలో మెలకువలు పాటించాలన్నారు. నగరంలో ప్రస్తుతం ఈ రెండు సెంటర్లతోపాటు మొత్తం యూనిట్లు వినియోగంలో ఉన్నాయని చెప్పారు.



మారథాన్ 5కే రన్ ప్రారంభిస్తూ రెడ్ బెలూన్లు గాలిలోకి వదులుతున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

అవగాహన, తగిన జాగ్రత్తలతో ఎయిడ్స్ నివారణ

ఎర్రబెల్లూన్లు ఎగురవేసి మారథాన్ 5కే రన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): అవగాహన, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లా సమగ్ర వ్యూహం (దిశ) ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోదావరి ఇస్కాన్ టెంపుల్ వరకూ మారథాన్ 5కే - రెడ్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి ఈ మారథాన్‌ను ఎర్రబెలూన్లు ఎగురవేసి, జెండా ఊపి, గన్‌పేల్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదివేలకు పైగా హెచ్ఐవీ కేసులున్నాయని, వీటిని పెరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి, యువతకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించడానికి ఈ 5కే రన్ నిర్వహించినట్టు చెప్పారు. జిల్లాలో హెచ్ఐవీ కౌన్సెలింగ్, పరీక్షల కోసం ఐదు ఎస్ఏ-ఐసీటీసీ కేంద్రాలు, 38 పీహెచ్‌సీ ఎఫ్1 ఐసీటీసీ కేంద్రాలు, 14 యూపీహెచ్‌సీ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడానికి సంచార సమీకృత సలహా, పరీక్షా కేంద్రం (మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్)ను కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించారు. హెచ్ఐవీ సంబంధిత సమాచారం కోసం జాతీయ హెల్ప్‌లైన్ నెంబరు 1097 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, కుష్టు క్షయ నివారణాధికారిణి డాక్టర్ వసుంధర, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు డాక్టర్ గన్ని మహాలక్ష్మి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రెడ్ రిబ్బన్ కో ఆర్డినేటర్ రవితేజ, వీటీ కళాశాల ప్రతినిధి జేజే విజయ్ ప్రకాష్, దిశ క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, ఏఆర్‌టీ సెంటర్ వైద్యులు, ఆర్ట్స్ కళాశాల, వీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని, సాయి నర్సింగ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం 5కే రెడ్ రన్ విజేతలను బాలురు, బాలికల విభాగంతోపాటు ట్రాన్స్‌జెండర్ల విభాగంలోనూ ఎంపిక చేసి వారికి బహుమతుల ప్రదానం చేశారు.

నేపాల్ హింసాత్మకం నేపథ్యంలో జిల్లాస్థాయి కంట్రోల్ రూం ఏర్పాటు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని హింస చెలరేగిన నేపథ్యంలో జిల్లాస్థాయి కంట్రోల్‌రూమ్‌ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జిల్లాకు చెందిన వ్యక్తులు, వారి బంధువులు ఎవరైనా నేపాల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం ఉంటే ఆ వివరాలను వెంటనే 8977935611 నెంబ రుకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెంబరు 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే ఢిల్లీలోని ఏపీ భవన్ నెం.9818395787, ఆంధ్రప్రదేశ్ హెల్ప్‌లైన్ నెం.8632340678, 8500027678లో కూడా సంప్రదించవచ్చని సూచించారు.

'ఆటో' పేమెంట్





ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించింది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆర్థికంగా ఆదుకోనున్నట్టు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆటోవాలాలకు ఆర్థిక సాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్టు అనంతపురం సభలో బుధవారం అధికారికంగా ప్రకటించడంతో ఆటో కార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి.

- ఆటో కార్మికులకు ప్రభుత్వం తీపికబురు
- స్త్రీశక్తి పథకం నేపథ్యంలో నష్టపోతున్న ఆటోవాలాలకు ఏటా రూ.15 వేలు
- దసరా రోజున పథకం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సీఎం చంద్రబాబు
- ఉమ్మడి జిల్లాలో 46 వేల ఆటో కార్మికులకు రూ.69 కోట్ల వరకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే హరిత పన్ను తగ్గించడంతో ఆటోలకు భారీగా తగ్గిన పన్ను భారం

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. ఆటో కార్మికుల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ప్రకటించారు. సూపర్‌సిక్స్ పథకాల సక్సెస్ సందర్భంగా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గత నెల 15వ తేదీ నుంచి మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కారణంగా ఆటోడ్రైవర్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కొన్ని రోజుల నుంచి ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటోకార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఒక్కో ఆటోవాలాకు అక్టోబరు 2న విజయదశమి రోజున ఆటో కార్మికులకు రూ.15వేల వంతున సాయాన్ని అందిస్తామని సీఎం చేసిన ప్రకటనతో ఆటో కార్మికుల్లో సంబరాలు మిన్నంటుతున్నాయి. పూట గడవడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం వేలాది ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా నింపనుందని ఆటో కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 వేల వరకు ఆటోలున్నాయి. ఇందులో కాకినాడ జిల్లాలో 13,194, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 17వేల వరకు ఆటోలున్నట్టు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆటోయూనియన్లు మాత్రం 50 వేలపైనే ఆటోలు ఉంటాయని చెబుతున్నాయి. ఈ పథకం అమలైతే ఉమ్మడి జిల్లాకు రూ.69 కోట్ల వరకు నిధులు కావలసి ఉంది.

అప్పట్లో ఊరించి ఊరించి అరకొరే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించారు. అదీ లబ్ధిదారులను ఎడాపెడా కోసేసి సంఖ్య తగ్గించేశారు. పైగా ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ అయిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీవోలను రంగంలోకి దించింది. చలాన్ల పేర్లతోను, రవాణాశాఖ నిబంధనల పేరుతోను రకరకాల ఫైన్‌లు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకునేది. పైగా వాహనమిత్ర పథకాన్ని కొంతకాలమే అమలుచేసి గాలికి వదిలేశారు. ఇక దసరా నుంచి అమలుకానున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు జారీచేయనుంది. పథకానికి అర్హత సాధించడానికి నిబంధనలపై స్పష్టత ఇవ్వనుంది. సొంత ఆటో ఉన్నవారు, అలాగే అద్దెకు తీసుకుని నడుపుతున్న కార్మికులు ఉమ్మడి జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈనేపథ్యంలో సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనేదానిపై స్పష్టత రానుంది. ఇదిలా ఉంటే గతంలో ఆటోలు ఉన్నప్పటికీ ఆటో నడిపే లైసెన్సు, బ్యాడ్జీలు కలిగిన వారికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కొత్త మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. దీనిపై కోనసీమ జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాల ద్వారానే ఎంత మంది లబ్ధిపొందుతారనేది తేలనుందని చెప్పారు.

మేలో హరిత పన్నుతో ఆనందం..

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరిత పన్ను పేరుతో ఎవరినీ వదలకుండా రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. లారీలు, టిప్పర్లు, కార్లు, ఆటోలు, స్కూలు బస్సులు, చివరకు బైక్‌లను కూడా పన్ను పేరుతో జేబులు గుల్లచేసేసింది రవాణా, రవాణాయేతర రంగాలకు సంబంధించి ఆయా వాహనాల నుంచి ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ అధికారులు హరితపన్నును వసూలు చేసేవారు. బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరితపన్నును భారీగా పెంచేసింది. సాధ్యమైనంత డబ్బును కోట్లలో పిండుకునేందుకు 2022 జనవరి 1 నుంచి హరితపన్ను పెంపును అమలుచేసింది. అప్పటిదాకా రూ.200 ఉన్న పన్ను ను వివిధ శ్లాబ్‌లుగా విడదీసేసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడు నుంచి పదేళ్ల అయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు పది నుంచి పన్నెండేళ్లుదాటితే ఒక త్రైమాసికం పన్ను విలువ, 12ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రవాణా, రవాణాయేతర వాహనాలపై భారీగా పన్ను భారం పడింది. పెరిగిన పన్ను భారం భరించలేక వాహనదారులంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆటోవాలాలకు భారీగా పన్ను భారం తప్పింది.

గుడ్డు.. బ్యాడ్డు..



- గుడ్డు ధర దోబూచులాట
- మొన్నటి వరకు బాగున్నా.. తాజాగా పతనం
- రైతు ధర రూ.5.45.. చేతికి దక్కేది ఐదే
- మరోవైపు పడిపోయిన దిగుబడులు
- బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర రూ.7

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లకు మంచి ధర పలకడంతో పౌల్ట్రీ రైతులు ఎంతో ఆనందపడ్డారు. అయితే ఈ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. కొద్దిరోజులుగా రైతుకు దక్కే గుడ్డు ధర అంతకంతకూ దిగజారిపోతోంది. ప్రస్తుతం గుడ్డు ధర పేపర్ రేటు ప్రకారం రూ.5.45కు పడిపోయింది. ఇది కూడా రైతుకు పూర్తిగా దక్కడం లేదు. ఈ ధరలో ఏజంటు కమిషన్ రూ.0.25 పైసలు పోతుంది. అంతేగాకుండా ట్రేడర్లు నిర్ణయించిన కమింగ్ రేటు ప్రకారమే ఇప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి. దాంతో రైతు చేతికి రూ.5 మాత్రమే దక్కుతోంది. ఈ ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదని పౌల్ట్రీ రైతులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి కోళ్లకు ఇటీవల పలు రకాల తెగుళ్లు రావడంతో కోళ్ల సంఖ్య పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.30 కోట్ల కోళ్లు ఉండగా, వీటి సంఖ్య 90 లక్షల వరకు పడిపోయింది. దీంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అయ్యే గుడ్లు ప్రస్తుతం 65 లక్షల నుంచి 70 లక్షలకు పడిపోయాయి. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురై కోళ్లు చనిపోవడంతో గుడ్లకు గిరాకీ పెరిగి గుడ్డు ధర రూ.5.90 వరకు ఎగబాకింది. అయితే గత పది రోజులుగా గుడ్డు ధర పడిపోవడం ప్రారంభించి ప్రస్తుత ధర రూ.5.45పైసలుగా ఉంది. ఉత్పత్తి తగ్గినా గుడ్డు ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంబరపడినంత సమయం కూడా లేకుండా పతనం దిశగా పయనిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలకాలంలో ఒడిసా సహా ఇతర రాష్ట్రాల్లో పౌల్ట్రీల సంఖ్య పెరగడంతో ట్రేడర్లు కూడా మన గోదావరి ప్రాంత ఎగుమతులపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం కమింగ్ ధరకే ప్యాకేజీలు జరుగుతుండడంతో పేపర్ ధర రూ.5.45 ఉన్నప్పటికీ ఏజంటు కమిషన్ 0.25 పైసల భారం ఎలాగూ రైతుపైనే పడుతోంది. అంతేకాకుండా అక్కడి ట్రేడర్లు నిర్ణయించిన ధరనే కమింగ్ రేటుగా పరిగణించడంతో ప్రస్తుతం రైతు చేతికి రూ.5.00 మాత్రమే చేరుతోంది. ప్రస్తుతం కొత్త బ్యాచ్‌లు వేయడంతో అవి గుడ్డు పెట్టే దశకు చేరుకునేందుకు మరో నాలుగైదు నెలల సమయం పడుతుందని, అప్పటివరకు ఇదే పరిస్థితి కొనసాగితే తాము నష్టాల బారిన పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఫీడ్ ధరలో పెద్దగా మార్పు లేకపోవడంతో టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని, గుడ్లు ఉత్పత్తి పెరిగే వరకు రూ.6.00 పైబడి ధర పలికితే గాని తాము కోలుకోలేమని రైతులు అంటున్నారు. వచ్చే శీతాకాలంపైనే ఆశలు పెట్టుకున్నామని, అప్పటికైనా ధర పెరిగితే నష్టాలు తగ్గుతాయని చెబుతున్నారు.

మార్కెట్‌లో ఇష్టారాజ్యం

వినియోగదారుల కోణంలో చూస్తే కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6.50 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి ఏడున్నర వరకు విక్రయాలు సాగుతున్నాయి. దాంతో చాలా దారుణంగా కోడిగుడ్ల ధరలు పెరిగిపోయాయని సామాన్యులు గగ్గోలుపెడుతున్నారు. పౌష్టికాహారం కోసం ఎక్కువగా గుడ్లనే వినియోగిస్తున్నందున అధిక భారం పడుతోందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రైతు వద్ద ధరలు తగ్గుతుండడంతో అటు హోల్‌సేల్‌లోనూ, ఇటు రిటైల్‌లోనూ ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి మాత్రం రిటైల్‌లో ఏడు రూపాయల ధరలోనే విక్రయాలు సాగుతుండడం గమనార్హం.

కోళ్ల పరిశ్రమకు పూర్వవైభవం చంద్రబాబు చేతుల్లోనే ఉంది



రాష్ట్రంలో ఏ పరిశ్రమ ఎలా ఉంది, ఎవరికి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలిసిన విధంగా మరే ముఖ్యమంత్రికి తెలియదనడంలో అతిశయోక్తి లేదు. 2014లో ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను తెలుసుకుని అనేక రాయితీలు కల్పించారు. ప్రస్తుతం పరిశ్రమ అప్పటికన్నా మరింత సంక్షోభంలో ఉంది. ప్రభుత్వపెద్దలు కోళ్ల పరిశ్రమపై దృష్టి సారించి పరిశ్రమను ఆదుకుంటారని రైతులంతా ఎదురు చూస్తున్నారు. **- పడాల సుబ్బారెడ్డి, రాష్ట్ర కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి**

అంబులెన్సుల దందాకు అంతమేది?

- విశాఖకు రూ.30 వేల కిరాయి
- చివరికి రూ.24 వేలు వసూలు
- రూ.19 వేలు కిరాయికి రూ.5 వేల కమీషన్
- 3 గంటలు రోగిని స్ట్రెచర్‌పై ఉంచి గందరగోళం
- 'ఆంధ్రజ్యోతి'ది అక్షర సత్యం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్సుల దందాకు అంతం కానరావడం లేదు. ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జిల్లా యంత్రాంగం తీవ్రంగా ప్రయత్నిస్తుంటే.. మరోవైపు అంబులెన్సుల దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఈనెల 4న 'శవాలతో బేరం' అనే శీర్షికతో ప్రైవేటు అంబులెన్సుల మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీంతో కలెక్టర్ ప్రశాంతి దృష్టి సారించారు. డిప్యూటీ కలెక్టర్, ప్రభుత్వాస్పత్రి ప్రత్యేక అధికారి భాస్కర్‌రెడ్డిని విచారణకు నియమించారు. ఆయన పలు వాస్తవాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంబులెన్సులకు సహేతుకమైన ధరలు నిర్ణయించడానికి కలెక్టర్ ఆదేశాలతో ఆర్టీవో ఇప్పటికే ఆస్పత్రికి వచ్చి కొంత సమాచారాన్ని సేకరించారు. ఈ ప్రక్రియ జరుగుతుండగానే బుధవారం ఓ పేదోడు దోపిడీకి గురయ్యాడు. రంగంపేట మండలం మర్రిపూడికి చెందిన ఓ బాలిక(17ఏళ్లు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా కొద్ది రోజులుగా రాజమహేంద్రవరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది మొదలుకావడంతో.. అక్కడి ఫీజులు తట్టుకోలేక బుధవారం ఉదయం ఆరు గంటలకు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అయితే విశాఖపట్నం కేజీహెచ్‌లో ఆమెకు సంబంధించిన వ్యాధికి మరింత మెరుగైన వైద్యం అందుతుందని బంధువులు చెప్పడంతో అంబులెన్స్ అవసరం ఏర్పడింది. ఆమెను స్ట్రెచర్‌పై బయటకు తీసుకొచ్చి అంబులెన్స్ కోసం వెతుకులాడుతుండగా అక్కడే ఉన్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు రంగంలోకి దిగారు. ఏకంగా రూ.30వేల కిరాయి అడిగారు. ఆమెకు వెంటిలేటర్ ఉన్న పెద్ద అంబులెన్స్(108 మాదిరిగా ఉండే ఫోర్స్ వాహనం) అవసరం, ఆస్పత్రి వద్ద అవి అందుబాటులో లేవు. దీనిపై ఆ తండ్రి ఆరా తీయగా పెద్ద అంబులెన్స్ వాళ్లు రూ.19వేలకే వెళతున్నారని తెలిసింది. కానీ వాళ్లను ఆస్పత్రి వద్ద తిష్ట వేసిన ప్రైవేటు అంబులెన్స్ వాళ్లు రానివ్వమంటూ అడ్డుపడ్డారు. పెద్ద అంబులెన్స్ కిరాయి రూ.19వేలు ఇచ్చేసి, తమకు కమీషన్‌గా రూ.11వేలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఉదయం 6.30గంటలకు స్ట్రెచర్‌పై బయటకు తీసుకొచ్చిన ఆ బాలికను 9.30గంటల వరకూ అలాగే ఉంచేసి గలాటా సృష్టించారు. చివరికి సమయం మించిపోతోందనే ఆందోళనతో ఆ తండ్రి ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లను కాళ్లావేళ్లా పడితే రూ.24వేలకు ఒప్పుకున్నారు. దానిలో రూ.18 వేలు పెద్ద అంబులెన్సుకు ఇచ్చి మిగతా సొమ్ము వాళ్ల జేబులో అక్రమంగా వేసుకున్నారు. ప్రభుత్వాస్పత్రి వద్ద అంబులెన్స్‌లు, ఆటోల స్టాండ్లు ఏమిటని, ఈ దోపిడీకి అడ్డుకట్ట ఎందుకు వేయలేకపోతున్నారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. యూనియన్లు, స్టాండ్లు అంటూ తమను గందరగోళానికి గురిచేసి దోపిడీ చేస్తున్నారని వాపోతున్నారు. సందట్లో సడేమియా మాదిరిగా తమది మరో యూనియన్ అంటూ ఇతర అంబులెన్సుల వాళ్లు చొరబడడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తాము బాగా తక్కువ ధరలకే వెళతామని చెబుతున్నారు. ఏదేమైనా పేదోళ్లను ఈ అంబులెన్సుల దోపిడీ నుంచి బయట పడేయాలని ప్రభుత్వాస్పత్రి వద్ద చర్చ నడుస్తుండడం గమనార్హం. కాగా ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వ అంబులెన్స్ సేవలు పడకేయడంపై విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ అంబులెన్సులను నిద్దరలేపి, ప్రైవేటు అంబులెన్స్ సర్వీసులను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొస్తే సమస్యలకు చాలామటుకు పరిష్కారం దొరుకుతుంది. అంతవరకూ కనీసం ఫిర్యాదు బోర్డులయినా ఏర్పాటుచేస్తే కాస్త మేలు జరుగుతుంది.



'తల్లి' మనసు

ఎంత ఉన్నతాధికారి అయినా.. ఆమె కూడా ఒకరికి అమ్మే కదా.. ఓ బిడ్డను ఎత్తుకుని లాలిస్తున్న ఈమె ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ. నన్నయ వర్సిటీకి సర్టిఫికెట్లు కోసం వచ్చిన ఓ మాతృమూర్తి కేంద్రపరిపాలనా భవనం వద్ద చంటిబిడ్డతో వేచి ఉంది. అటువైపు వెళుతున్న వీసీ.. ఆమె వద్దకు వచ్చి ఆరా తీశారు. సర్టిఫికెట్ల పనిపై వచ్చిన ఆ తల్లికి త్వరగా పనిపూర్తి చేసి పంపించాలని సిబ్బందికి సూచించారు. అంతవరకూ బిడ్డను వీసీ ఎత్తుకుని వర్సిటీ ఆర్ట్స్ కామర్స్ కళాశాలలోని కార్యాలయాన్ని, ఇతర విభాగాలను పరిశీలించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది హాజరుపట్టీలను తనిఖీచేశారు. అంతసేపూ ఆ బిడ్డ ఏడవకుండా వీసీని హత్తుకుని ఉండడం విశేషం. **- దివాన్‌చెరువు**

యూరియాకు టోకెన్ తప్పనిసరి

క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. టోకెన్ పొందిన రైతుకు తప్పనిసరిగా యూరియా అందజేస్తామని, అయితే టోకెన్ మాత్రం కచ్చితంగా ఉండాలన్నారు. టోకెన్ ఉన్న రైతులు క్యూలో నిలబడాల్సిన అవసరం లేదని, ఎప్పుడైనా యూరియా తీసుకోవచ్చన్నారు. బుధవారం వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలోని రైతు సేవా కేంద్రాల సహాయకులతో వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ సిఫారసుల మేరకు రైతులకు యూరియా కేటాయింపు ఉంటుందన్నారు. ఆయా రైతు కేంద్రాలకు కేటాయించిన యూరియా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సహకార సంఘాల వారీగా పంపిణీ రికార్డులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏదైనా సహకార సంఘం పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెలుపల రైతులకు యూరియా అందజేస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారులు ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. తాడేపల్లిగూడెం, ద్వారపూడి రైల్వే ర్యాక్ పాయింట్ల ద్వారా బుధవారం నాటికి 500 టన్నుల యూరియా జిల్లాకు చేరిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, జిల్లా సహకార అధికారి వెంకట రమణ, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, మార్క్‌ఫెడ్ డీఎండీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ ప్రచార్ అభియాన్ కో కన్వీనర్‌గా నల్లమిల్లి



అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీకి చెందిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ ప్రచార్ అభియాన్ కమిటీలో ఏపీ నుంచి కో కన్వీనర్‌గా నియమిస్తూ బీజేపీ జాతీయ పార్టీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. జీఎస్టీ తగ్గింపుపై చారిత్రక అడుగువేసిన నేపథ్యంలో ఏర్పాటుచేసిన జీఎస్టీ ప్రచార్ అభియాన్ కమిటీలో ఏపీ నుంచి కన్వీనర్‌గా ఎంపీ పాకా సత్యనారాయణను నియమించగా, కో కన్వీనర్‌గా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని నియమించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ జాతీయ కార్యవర్గం తనపై నమ్మకంతో కమిటీలో స్థానం కల్పించిందని, తన శక్తి వంచన లేకుండా తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తానన్నారు. కమిటీలో స్థానం కల్పించిన ప్రధాని మోదీకి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



జీఎస్టీ.. థ్యాంక్స్

జీఎస్టీ నాలుగు శ్లాబుల విధానాన్ని రద్దు చేసి రెండు శ్లాబుల విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టనుంది. ప్రధాని మోదీ చేపట్టిన తాజా సంస్కరణలతో ప్రజలపై ఎంతో భారం తగ్గనుందని, ఈ సందర్భంగా మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ రాజమహేంద్రవరంలో బుధవారం బీజేపీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా మోదీకి పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు.. **- రాజమహేంద్రవరం అర్బన్**

జిల్లా పోలీసులకు ఏబీసీడీ అవార్డు 8

రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి రైళ్ల హాల్ట్‌ల పునరుద్ధణపై రైల్వేశాఖ సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని రైల్వేపరిరక్షణ సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రైల్వేస్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో నిలుపుదల చేసిన రైళ్లకు తిరిగి హాల్టింగ్ కల్పించాలని రైల్వే అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు, పోస్టుకార్డులు అందించామన్నారు. నిరసనలో గారపాటి రామ్మోహనరావు, హజీబు జగన్నాథరావ్, చామర్తి విశ్వనాథరావు, ఆలీషా, చెల్లేశ్వరరావు, నక్కా వెంకటరత్నం, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు ఎర మందు పంపిణీ



ధర్మవరంలో ఎర మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎలుకల నిర్మూలనకు రైతులకు ఎర మందు పంపిణీ చేసినట్టు అగ్రికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ జీ.సునీత తెలిపారు. ధర్మవరంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్ ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు ఎర మందును పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా బ్రోమోడయాలోన్ అనే ఎర మందు రైతులకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వంద గ్రాముల ఎర మందు తయారీ కోసం... రెండు గ్రాముల బ్రోమోడయాలోన్, 96 గ్రాముల నూకలు, 2 గ్రా. నూనె కలిపి సజీవ బొరియకు 10 గ్రా. చొప్పున పొట్లాలు కట్టి పెట్టాలన్నారు. ఈ ఎర మందు వల్ల 5 నుంచి 6 రోజుల్లో ఎలుకలు చనిపోతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ మంత్రి పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



నిరసన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసం భారత్ కృషిచేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరు పట్టణంలో ఇజ్రాయిల్ ఆర్థికమంత్రి బిబెల్ రిస్మెచ్ భారత పర్యటనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధాలను భారత్ వ్యతిరేకించాలని, ప్రపంచ శాంతి కోసం కృషిచేయాలన్నారు. ఇజ్రాయిల్ తక్షణమే గాజాపై యుద్ధాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ యుద్ధానికి పాల్పడడం వల్ల 60 వేల మంది మృతిచెందారన్నారు. కార్యక్రమంలో పీవో డబ్ల్యు నాయకురాలు ఈ.మల్లిక, నాగమణి, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో వైద్యశిబిరం

చాగల్లు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణగూడెంలో డయాబెటిక్ రెటినోపతి శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి 38 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, ఇందులో 10 మందికి రెటినోపతి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల వారు హాజరై వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కరుటూరి చౌదరి, కార్యదర్శి గారపాటి మోహన్, కోశాధికారి మట్టపర్తి చంద్రరావు, లయన్ సభ్యులు గారపాటి బాబూరావు, జీఎస్ఆర్‌కే ప్రసాద్, గన్నమని రామకృష్ణ, సుంకవల్లి సత్యనారాయణ, నిడదవోలు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నేడు ఉపకరణాల పంపిణీ

నిడదవోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలకు గురువారం ఉపకరణాల పంపిణీ కోసం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంఈవో గణేష్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. దీనికి వచ్చేవారు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఫొటో, తదితరవి తీసుకురావాలన్నారు.

వెలగదుర్రులో అన్నసమారాధన

ఉండ్రాజవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వెలగదుర్రులో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాల్లో ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు మడిచర్ల తుకారాం, గున్నేపల్లివెంకటేశులు, అంగర శ్రీనివాసు, విష్ణుమూర్తి, భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

పేదలకు అత్యాధునిక వైద్యం

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. దొమ్మేరుకు చెందిన కోడి సోమేశ్వరి కుటుంబసభ్యులకు రూ. 83,972 మంజూరయ్యాయి. కార్యక్రమంలో దొమ్మేరు ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, వేమగిరి వెంకట్రావు, వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిధులు

నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలం పైడిమెట్ట లిఫ్ట్ ఇరిగేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వారంతా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ. 9,75,000 నిధులు మంజూరయ్యాయి. ఆ పత్రాలను బుధవారం ఇరిగేషన్ డీఈ దుర్గా గురవయ్య, పథకం కమిటీ సభ్యుడు గన్నిన సత్తిబాబుకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, అధికారులతో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

నల్లజర్ల హైస్కూల్‌లో భోజనశాల ఏర్పాటు



భోజనశాలను ప్రారంభిస్తున్న బాపిరాజు తల్లి విజయలక్ష్మి

నల్లజర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు తండ్రి వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నల్లజర్ల హైస్కూల్‌లో రూ. 15 లక్షలు విలువ చేసే భోజనశాలను నిర్మించారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, టీడీపీ మండలాధ్యక్షులు తాతిన సత్యనారాయణ, వెంకటరత్నం భార్య విజయలక్ష్మి, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు రావూరి వెంకటరమణ, కోడూరి నారాయణ, బేతిన దుర్గారావు, కోరా కన్నయ్య, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, ఆలపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ

కొవ్వూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రిడ్జిపేటలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

23 అడుగుల భారీ గణనాథుడి శోభాయాత్ర



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద గల 23వ వార్డు రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 23 అడుగుల భారీ వినాయకుడి శోభాయాత్రను బుధవారం వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. వినాయకుని చేతిలోని 109 కేజీల లడ్డూని హైదరాబాద్‌కు చెందిన ఎస్ఆర్ఆర్ మస్తీగ్యాంగ్ జీ.వెంకటరెడ్డి, పసుపులేటి శివనాగ్, వీరరాఘవరెడ్డి, బండ్ల కిరణ్, పీఎల్ నారాయణ, గంగ్రోతు స్వామి రూ. 93 వేలకు దక్కించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా క్రైం అదనపు ఎస్పీ అర్జున్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

దేవరపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలోని ఇంటర్ విద్యార్థులకు బుధవారం అదే గ్రామానికి చెందిన వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ జిల్లా గవర్నర్ శ్రీకాకుళపు కాళీకృష్ణ యూనిఫాంను అందజేశారు. ఈ సందర్భంగా కాళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కాళీకృష్ణ రూ.20 వేలు, ఈలప్రోలు చిన్ని రూ.20వేలు విలువ చేసే దుస్తులను విద్యార్థులు ఒక్కొక్కరికి రెండు జతలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సుతాపల్లి రామారావు, నాళం బాలకృష్ణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో యూనిఫాం అందజేస్తున్న పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాళీకృష్ణ

నేడు సర్వ సభ్య సమావేశం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డీఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షత వహిస్తారన్నారు. దీనికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. సత్యసాయి సేవా సమితి జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎస్వీ సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మార్పు అనేది ముందు నీతో మొదలైతే ప్రపంచంలో పరివర్తనకు నాందికాగలవు' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామికి విశేష పూజలు

నిడదవోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మునిపల్లిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామికి బుధవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఏడువారాలు 11 ప్రదక్షిణలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



మునిపల్లిలో పూజలందుకుంటున్న స్వామివారు

అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

తాళ్లపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధిపై అధికారులకు బుధవారం ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి శిక్షణ ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, పలుగ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో గుర్తు తెలియని మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నందమూరు రోడ్డులోని యువరాజ్ మల్టీప్లెక్స్ సమీపంలో గల లిటిల్ టానిక్ బార్ ఎదురుగా ఉన్న పాడుబడిన భవనం శ్లాబ్‌పై గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉన్న మృతదేహాన్ని అటుగా వెళ్తున్నవారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారుగా 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. వీఆర్‌వో అజీ మున్నీసా అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

జిల్లా పోలీసులకు ఏబీసీడీ అవార్డు

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ఏబీసీడీ అవార్డులకు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎటువంటి ఆధారాలు లేని కేసులు ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ అధికారులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏబీసీడీ అవార్డులను రాష్ట్ర డీజీపీ (ఫస్ట్,సెకండ్, థర్డ్, కన్సోలేషన్ అవార్డులను) స్వయంగా అందజేస్తారు. ఈ ఏడాది రెండవ క్వార్టర్‌కి సంబంధించి జిల్లా పోలీసులు ఏబీసీడీ అవార్డులలో మొదటి బహుమతికి ఎంపికయ్యారు. రెండో బహుమతి మంగళగిరి, మూడో బహుమతి ధర్మవరం రూరల్ పీఎస్, కన్సోలేషన్ బహుమతి ఒంగోలు తాలూకా పీఎస్‌కు దక్కాయి. కొవ్వూరు పట్టణానికి చెందిన వెస్టేజ్ ఉత్పత్తుల వ్యాపారి పెండ్యాల ప్రభాకరరావును 2025 మార్చి నెలలో మండలంలోని దొమ్మేరు పంటపొలాల్లో హత్య చేసి, నగదు దోచుకుపోయిన కేసును జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ జీ.దేవకుమార్ ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ కే.విజయ్‌బాబు, ఎస్ఐలు పీ.రవీంద్ర, కే.జగన్మోహన్, కె.శ్రీహరిరావుతో పాటు పోలీసు సిబ్బంది, ఎటువంటి ఆధారాలు లభించనప్పటికీ కేసు ను అతి తక్కువ సమయంలో ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన జిల్లా ఎస్పీ, డీఎస్పీ, పట్టణ, రూరల్ సీఐలు, ఎస్‌లు సిబ్బంది ఈ నెల 12వ తేదీన మంగళగిరిలోని రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా చేతులమీదుగా ఏబీసీడీ అవార్డును అందుకోనున్నారు.

నిడదవోలులో రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



నిడదవోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

నిడదవోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఐదు ప్రాంతాల నుంచి రణభేరి టీములు మొదలవుతాయని, ఉపాధ్యాయ సమస్యలపై ఈ రణభేరి మోగిస్తారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జీ.జయకర్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19 వరకు ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని రణభేరీ టీములు పర్యటిస్తాయన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు ఇవ్వాలి

• విశ్రాంత ఉద్యోగుల డిమాండ్

నల్లజర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాత బకాయిలు ఇవ్వకపోయినా.. కనీసం పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలనైనా ప్రభుత్వం మంజూరు చేయాలని, మిగిలిన డీఏలు జనవరికి అందించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల శాఖ సమావేశం అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా పూర్వ విద్యార్థి, రిటైర్డు సైనికుడు(హవల్దార్)తలంశెట్టి మోహన్ శేషు కుమార్‌ను, నల్లజర్ల నెం.1 పాఠశాల హెచ్ఎం మానుకొండ గంగరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో వారిని విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్కరించింది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి ఐడీవీ అప్పారావు, ఎస్ఎం ఆలీసాహెబ్, కామేశ్వరరావు, నెక్కలపూడి ప్రతాప్, దత్తు, శ్రీరామూర్తి, పూర్వ విద్యార్థులు నీలం సుబ్బారావు, సాంబమూర్తి నరేష్, పాతూరి సురేష్ పాల్గొన్నారు.



మాజీ సైనికుడు మోహన్ శేషు కుమార్, ఉత్తమ ఉపాధ్యాయుడు గంగరాజును సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఏపీటీఎఫ్ నిరసన వారం

కొవ్వూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వం నాన్చివేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వారం కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏపీ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీడీరావు తెలిపారు. బుధవారం కొవ్వూరు మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీ రావు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వారం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రామారావు, బీ.రాంబాబు, ప్రసన్నలక్ష్మి, రషీద, విష్ణు, సలీం, జానీ, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు మండలంలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

దేవరపల్లిలో ప్రత్యేక వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల పిల్లలకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే నిర్ధారణ పరీక్షలను వినియోగించుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవ రపల్లి అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగుల ప్రత్యేక అవసరాలకు తగిన విధంగా ప్రోత్సాహన్ని విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కేఆర్ ఎస్వీ బీ.అప్పారావు, కేవీఎన్. సత్యనారాయణ, ఆకుల ఉమామహేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవా సంస్థ ఆర్థిక సాయం



విద్యార్థికి చెక్కును అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంకి చెందిన చేమకురి శ్రీదేవి (గాజుల) కుమార్తె అంకిత చదువు నిమిత్తం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ. 10వేల ఆర్థిక సహాయం చేసినట్టు మండల కన్వీనర్ గూళ్లపూడి వెంకటరత్నం తెలిపారు. అంకిత డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువు తోంది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో స్పందించిన మండల మానవత సంస్థ చెక్కును అందించింది. కార్యక్రమంలో కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, కోశాధికారి ఐడీవీ అప్పారావు, విద్యాకమిటీ డైరెక్టర్ నందం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

- టీడీపీ సీనియర్ నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి

దేవరపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరుకి చెందిన టీడీపీ క్రియాశీలక కార్య కర్త గాలింకి రాజు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఆ పార్టీ సీనియర్ నేత ముళ్లపూడి దొరాజీ చౌదరి హామీ ఇచ్చారు. రాజు ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే.. ఈ మేరకు బుధవారం ఆయన కుటుంబాన్ని చౌదరి పరామర్శించి, ముళ్లపూడి వెంకట్రావు (ఎంవీఆర్) ట్రస్ట్ ద్వారా రాజు కుమారుడు, కుమార్తె ఒక్కొక్క రికి రూ.25వేలు చొప్పున మొత్తం రూ. 50 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు మేలు చేసేందుకు గాను రాష్ట్రప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొయ్యల మూడి తాతారావు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ముళ్లపూడి సత్యనారాయణ, కొయ్యలమూడి తాతారావు, కే.రవికుమార్, కడియం సూర్యనారాయణ, కంటిపూడి అశోక్, మెంతిమి అమరావతి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న దొరాజీ చౌదరి, తదితరులు

దేవరపల్లిలో ఇండియన్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం

దేవరపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు ఖాతాదారులకు ఇండియన్ బ్యాంకు మంచి సేవలందిస్తోందని ఫీల్డ్ జనరల్ మేనేజర్ (హైదరాబాద్) ప్రణేశ్‌కుమార్ తెలిపారు. దేవరపల్లిలో బుధవారం ఇండియన్ బ్యాంకు నూతన శాఖ ప్రారంభమైంది. ప్రణేశ్‌కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మొత్తం 5,910 శాఖలు ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రీజియన్‌లో అయితే 65 బ్రాంచులున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవరపల్లి పరమేశ్వర బయోటెక్ చైర్మన్ ఉపేంద్రరెడ్డి, ఎండీ ఏ.ఆనంద్ స్వరూప్ రూ. రెండుకోట్లు డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్, రాజమహేంద్రవరం ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ కే.రాజ్‌కుమార్, ఇండియన్ బ్యాంకు డిప్యూటీ జోనల్ మేనేజర్ కేవీఎస్.మూర్తి, బ్రాంచ్ మేనేజర్ ఏజేవీ.రాజీవ్, తిరుమల విద్యాసంస్థల ప్రతినిధి నున్నా సురేశ్, స్థానికులు గన్నమని హరికృష్ణ, జొన్నలగడ్డ సూర్యారావు, ముళ్లపూడి దొరాజీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



శాఖను ప్రారంభిస్తున్న ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేశ్‌కుమార్

IN THE COURT OF THE IX ADDL.DISTRICT JUDGE CUM FAMILY COURT RAJAMAHENDRAVARAM
ARB E.P. No.980 of 2019
ARBITRATION CASE No. 33 of 2018

Between:
Shiram City Union Finance Ltd.,
Rajahmundry -1Branch Rep. by its
Deputy General Manager & G.P.A Holder
Mr. K. Sreerama Murthy,
RAJAMAHENDRAVARAM Zone ... D. Hr

And

1.Burra Dilip Kumar
2.Dokuburra Prasanthi
3.Gandham Durga Prasad ...J. Dr's 1to 3

పై నెంబరు గ్రంథము నందు డిక్రీ బాకీ మరియు ఖర్చులు దర్శిలా వడ్డీ మరియు ఇతర ఖర్చులు వసూలు చేసుకునే నిమిత్తం 1వ JDR అయిన శ్రీ బుర్ర దిలీప్ కుమార్ గారి యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో గల ఈ క్రింది ఇ.పి.షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ కోర్టు వారు **25.09.2025** తేదీనే శ్రీ కోర్టు వారి ఆవరణలో ఉదయం.10.30 ని॥ల నుండి బహిరంగంగా వేలం నిర్వహించబడునని, కావలసినవారు శ్రీ కోర్టు వారి యెదుట జరుగు వేలం పాటలో పాల్గొని పాడుకోవలసినదిగాను యిందుమూలముగా యావన్మందికి ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచటం అయినది. వేలం పాటలో పాల్గొనదలచిన వారు తదుపరి వివరముల కొరకు రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు కమ్ ఫ్యామిలి కోర్టు మరియు నజారత్ వారి ఆఫీసు నందు సంప్రదించగలరు.

EP SCHEDULE FILED BY THE DECREE HOLDER

East Godavari District, Rajahmundry District Registrar Area, Pidimgoyyi Sub-District, Rajahmundry Rural Mandal, Katheru Gram Panchayat and Village,Zeriothy dry land covered by R.S.No: 115/1 out of an extent 484 Sq. Yds Southern side an extent of 121 Sq. Yds or 101 Sq. Meters. If site together with RCC building bearing D.No. 3-123 is measured and bounded as follows:-**East**: Joint boundary wall 66 Feet , **South**: Thatched house of P Mary 16.5 Feet **West**: Thatched house of D Moshey 66 Feet , **North**: Main Road 16.5 Feet.

With the above boundaries,Southern side an extent of 121 Sq. Yds or 101 Sq. Meters. If site together with RCC building bearing D.No. 3-123 is measured with all usual and easement righrs etc.

DHR విలువ : రూ. 4,00,000
అమీనావిలువ : రూ. 15,00,000
మార్కెట్ విలువ : రూ. 16,94,000

Place:RAJAMAHENDRAVARAM
Date:10.09.2025

M.Surya Mohana Rao, Advocate,
RAJAMAHENDRAVARAM
PH. 98492'88161